www.truepointnews.com
ESTD 2024
PointNewsDaily
pointnewsdaily
ARN No: T/TG/2024/1040
Vol.I ISSUE 273
*Air Surcharge Extra Applicable

# పాయింట్

Published From : Hyderabad - Vijaywada - Delhi - Bengaluru

శుక్రవారం 11, జూలై, 2025 | పేజీలు :12



## రేవంత్‌కు వాస్తు భయం : కవిత

2




## మల్నాడు కిచెన్ డ్రగ్స్‌పై ఈగల్ స్పెషల్ ఫోకస్..!

2



## ఓరుగల్లు హస్తంలో అంతర్గత కల్లోలం..!

3




## తల్లి ప్రియుడితో కలిసి తండ్రిని చంపిన కూతురు

**టీపీఎన్, ఘట్‌కేసర్ :**

ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ చెరువులో చోటుచేసుకున్న ఓ భయానక ఘటన ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్న తండ్రిని హత్య చేయాలని తల్లీకూతుళ్లు ప్రణాళిక వేసి, ప్రియుడి సహకారంతో హత్య చేసిన దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. జూలై 7న ఎదులాబాద్ చెరువులో ఓ మృతదేహం కనిపించడంతో, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీయగా, దానిపై గాయాలు

..మిగతా 2లో



# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు..?

- కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం
- అన్ని పార్టీలు మద్దతివ్వాలని విజ్ఞప్తి

**టీపీఎన్, హైదరాబాద్ :**

కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సెక్రటేరియట్ జీ29 నుంచి జరిగిన మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 4, 2024 నుంచి కుల గణన సర్వే నిర్వహించి, 2025 ఫిబ్రవరి 4 నాటికి నివేదిక సిద్ధం చేసి, రిజర్వేషన్లు పెంచే చట్టాన్ని ఆమోదించామని వెల్లడించారు. చట్టం 3, 4 ప్రకారం రాహుల్ గాంధీ ఆలోచన మేరకు బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టం చేశామని తెలిపారు. ఈ చట్టాన్ని గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపించామన్నారు. కోర్టు తీర్పు ప్రకారం నెల రోజుల్లో రిజర్వేషన్లు పూర్తి చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, అందుకు అనుగుణంగా 19వ కేబినెట్ సమావేశంలో చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేబినెట్ నిర్ణయించిందని ప్రకటించారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు మద్దతు ఇవ్వాలని, కేవలం మాటలకే పరిమితం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సామాజిక న్యాయం కోసం "జిత్నీ అబాదీ, ఉత్నీ హిస్సేదారీ" అనే రాహుల్ గాంధీ సూత్రం మేరకు కుల గణన సర్వే నిర్వహించామని, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంపిరికల్ డేటా సేకరించి దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని అన్నారు. స్థానిక పరిస్థితుల ఆధారంగా రిజర్వేషన్లు పెంచవచ్చని కోర్టులు అనేక సందర్భాల్లో తీర్పు ఇచ్చాయని, ఈ నేపథ్యంలో కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని, కేబినెట్‌కు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నేపథ్యంలో ఉద్యోగాలు, నీళ్లు, నిధుల కోసం జరిగిన ఉద్యమాన్ని గుర్తు చేస్తూ, ప్రజా పాలన ప్రభుత్వం ఇప్పటికే 60 వేల ఉద్యోగాలు ఇచ్చిందని, 17 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేసి జాబ్ క్యాలెండర్ ఇవ్వడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. మార్చి 2026 నాటికి లక్ష ఉద్యోగాలు పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై అధికారుల కమిటీ ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని నిర్ణయించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి సిద్ధంగా ఉందని, ఈ నిర్ణయం చారిత్రాత్మకమని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

## యశోదలో వైద్య పరీక్షలు పూర్తి.. డిశ్చార్జైన కేసీఆర్!

**టీపీఎన్, హైదరాబాద్ :**

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో వైద్య పరీక్షలు పూర్తయ్యాయి. దీంతో గురువారం ఆయనను వైద్యులు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అనంతరం ఆయన హైదరాబాద్‌లోని నందినగర్‌లో ఉన్న తన నివాసానికి కుటుంబ సభ్యులతో కలిసి చేరుకున్నారు.వైద్యుల సూచనల మేరకు గురువారం ఉదయం కేసీఆర్ యశోద ఆసుపత్రిలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు వైద్యులు మరోసారి వైద్య పరీక్షలు నిర్వహించారు. గతంలో, జులై 3వ తేదీన కేసీఆర్ అనారోగ్యంతో యశోద ఆసుపత్రిలో చేరారు. ఆ సమయంలో బ్లడ్ షుగర్, సోడియం స్థాయిలను పరిశీలించేందుకు రెండు రోజుల పాటు ఆసుపత్రిలో ఉండాలని వైద్యులు సూచించారు. ఆరోగ్యం కుదుటపడటంతో జులై 5వ తేదీన ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. అయితే, వారం రోజుల విశ్రాంతి తీసుకుని, ఆ తర్వాత మరోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో ఈ రోజు కేసీఆర్ మళ్లీ యశోద ఆసుపత్రికి వెళ్లారు. మరోవైపు, జూన్ 11వ తేదీన కాళేశ్వరం ప్రాజెక్ట్ విచారణ కమిషన్ జస్టిస్ పీసీ ఘోష్ సమక్షంలో కేసీఆర్ హాజరయ్యారు. ఆ సమయంలో ఆయన అనారోగ్యంతో ఉన్నారు. కమిషన్ ఎదుట హాజరైన వెంటనే ఆయన ఎర్రవల్లిలోని తన ఫామ్‌హౌస్‌కు వెళ్లారు. ఆ తర్వాత తీవ్ర జ్వరం, జలుబు, గొంతు నొప్పి వంటి సమస్యలతో ఆయన బాధపడ్డారు. ఈ నేపథ్యంలో జులై 3వ తేదీన ఎర్రవల్లి నుంచి నందినగర్‌లోని తన నివాసానికి చేరుకున్న కేసీఆర్‌కు అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. మరిన్ని పరీక్షల కోసం ఆసుపత్రిలో చేరాలని సూచించడంతో ఆయన యశోద ఆసుపత్రిలో చేరారు.




## హెచ్‌సీఏ అధ్యక్షుడిపై ఫోర్జరీ ఆరోపణలు..!

- హెచ్‌సీఏ అధ్యక్షుడి అరెస్ట్‌పై సీఐడీ క్లారిటీ
- నకిలీ పత్రాలు సృష్టించి అధ్యక్ష పదవి పొందారని ఆరోపణలు
- మాజీ మంత్రి కృష్ణయాదవ్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తింపు
- అధ్యక్షుడితో పాటు మరో నలుగురిని అదుపులోకి తీసుకున్న సీఐడీ
- నిధుల దుర్వినియోగం జరిగిందని మరో ఫిర్యాదు నమోదు

**కృష్ణకుమార్, టీపీఎన్, స్పెషల్‌డెస్క్ :**

క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు.. ఆయన టీమ్ అరెస్ట్‌పై సీఐడీ ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రకటనలో విస్తుపోయే విషయాలను బయటపెట్టింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో కీలక పరిణామం చోటుచేసుకుంది. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావును సీఐడీ అధికారులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. నకిలీ పత్రాలను ఉపయోగించి ఆయన అధ్యక్ష పదవిని పొందినట్లు ఆరోపణలు రావడంతో ఈ చర్య తీసుకున్నట్లు సీఐడీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆయనతో పాటు మరో నలుగురిని కూడా అదుపులోకి తీసుకున్నారు.
సీఐడీ వెల్లడించిన వివరాల ప్రకారం, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ పేరుతో జగన్మోహన్‌రావు నకిలీ పత్రాలు సృష్టించారు. ఈ క్లబ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కవిత, గౌలిపురా క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు, మాజీ మంత్రి సి. కృష్ణయాదవ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఆ పత్రాలను జగన్మోహన్‌రావుకు అందజేశారు. వాటిని ఆధారంగా చేసుకుని ఆయన హెచ్‌సీఏ ఎన్నికల్లో పోటీ చేసి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత హెచ్‌సీఏలో నిధుల దుర్వినియోగం జరిగిందని టీసీఏ అధ్యక్షుడు గురువారెడ్డి ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ మోసంలో జగన్మోహన్‌రావుకు హెచ్‌సీఏ కోశాధికారి శ్రీనివాసరావు, సీఈవో సునీల్ సహకరించినట్లు దర్యాప్తులో తేలిందని సీఐడీ పేర్కొంది. దీంతో జగన్మోహన్‌రావు, శ్రీనివాసరావు, సునీల్, రాజేందర్ యాదవ్‌తో పాటు ఫోర్జరీకి పాల్పడిన కవితను కూడా అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఫోర్జరీ, నిధుల దుర్వినియోగం వంటి తీవ్రమైన ఆరోపణలు హెచ్‌సీఏ పరిపాలనకు మాయని మచ్చగా మారాయి.

# బెట్టింగ్ యాప్స్ బెండు తీసేందుకు రెడీ అయిన ఈడీ



- పలువురు సెలబ్రిటీలపై కేసు నమోదు
- మనీలాండరింగ్ కింద విచారణకు సిద్ధం..
- తాఖీదులు రెడీ చేసిన ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు

**కృష్ణకుమార్; టీపీఎన్, స్పెషల్ డెస్క్ :**

బెట్టింగ్ యాప్సHని ప్రమోట్ చేసిన వారి బెండు తీసేందుకు సమయం సిద్ధమైంది. ఈ వ్యవహారంలో ఇప్పటికే హైదరాబాద్ కమిషనరేట్, సైబరాబాద్ కమిషనరేట్ పోలీసులు విడివిడిగా కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో పంజాగుట్ట పోలీసులు 11 మంది యుట్యూబర్స్‌పై కేసులు నమోదు చేసి విచారణ చేసి చేతులు దులుపుకొన్నారు. ఇందులో కొందరు హైకోర్టుకి వెళ్లి అరెస్ట్ కాకుండా ముందస్తు ఆదేశాలతో పోలీసుల ఎదుట హాజరయ్యారు. ఇక సైబరాబాద్ పోలీసులు మాత్రం కేవలం కేసులు నమోదు చేయడానికే పరిమితం అయ్యారని ఆరోపణలు ఉన్నాయి. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ట్విట్టర్..ఎక్స్ వేదికగా పోరాటం చేయడంతో పోలీస్ శాఖలో చలనం వచ్చింది. మొదట్లో నానా హడావిడి చేయడంతో బెట్టింగ్ యాప్స్ కి బ్రేక్ పడుతుందని అందరూ భావించారు. అయితే పోలీసులు ఈ వ్యవహారాన్ని అంత సీరియస్‌గా తీసుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ఇటీవలే బెట్టింగ్ యాప్స్‌లో పెట్టిన డబ్బు కోసం అడిగిన తండ్రిని చంపిన కొడుకు, దొంగిలించిన సొత్తుతో బెట్టింగ్ చేసిన యువకులు అంటూ అనేక ఘటనలు నగరంలో చోటు చేసుకున్నాయి. దీంతో మరోసారి పోలీసుల్లో చలనం వస్తుందని అందరూ భావించారు. బట్ కేసుల నమోదు.. మీడియాలో వార్తలకే పరిమితమయ్యాయి. పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో మరోసారి ఈ బెట్టింగ్ యాప్స్ విరుచుకు పడ్డాయి. ముందుకన్న మరింత వేగంగా మార్కెట్‌లోకి దూసుకుపోవడంతో 300 మందికి పైగానే బాధితులు దీని బారిన పడ్డారు. అయితే ఈ యాప్స్‌పై ఈ సారి ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు ఫోకస్ పెట్టారు. యూట్యూబర్లు, సినిమా హీరో, హీరోయిన్స్ సెలబ్రిటీలు, బెట్టింగ్ యాప్స్ యజమానులపై మనీలాండరింగ్ కింద కేసులు నమోదు చేశారు. వారికి నోటీసులు ఇచ్చి విషయాలు రాబట్టాలని సంకల్పించారు. కోట్ల రూపాయల్లో యాప్స్ ప్రమోట్ చేసేందుకు రెమ్యునరేషన్ తీసుకున్నారని, ఇదంతా హవాలా ద్వారా డబ్బుల పంపకాలు జరిగినట్లు ఈడీ భావిస్తోంది. తీసుకున్న డబ్బు గుట్టు రట్టు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈడీ నమోదు చేసిన కేసులో ప్రఖ్యాత సినీ నటులు, టీవీ సెలబ్రిటీలు, డిజిటల్ ఇన్ఫ్లుయెన్సర్లు పేర్లు ఉన్నాయి. వీరిలో రానా దగ్గుబాటి, ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మీ, ప్రణీత సుభాష్, నిధి అగర్వాల్, అనన్య నాగళ్ల, సిరి హనుమంతు, శ్రీముఖి, వర్షిణి సౌందరరాజన్, వసంతి కృష్ణన్, శోభా శెట్టి, అమృతా చౌదరి, నయనీ పావని, నేహా పఠాన్, పండు, పద్మావతి, ఇమ్రాన్ ఖాన్, విష్ణు ప్రియ, హర్ష సాయి, భయ్యా సన్నీ యాదవ్, శ్యామల, టేస్టీ తేజ, రీతు చౌదరి, బండారు శేషయానీ సుప్రీత ఉన్నారు. వీళ్లు మాత్రమే కాకుండా, బెట్టింగ్ యాప్‌లను నడిపించిన కీలక వ్యక్తులు కూడా ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. రోవైపు బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు కిరణ్ గౌడ్, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు అజయ్, సన్నీ, సుధీర్, యూట్యూబ్ చానల్ లోకల్ బాయ్ నాని డిజిటల్ వాలెట్ల ద్వారా జరిపిన ఆర్థిక లావాదేవీలు దర్యాప్తులో భాగంగా పరిశీలనలో ఉన్నాయని సమాచారం. ఈడీకి ఆధారాలు లభించడంతో విచారణ ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ కేసులో మనీ ట్రైల్, డిజిటల్ ఫుట్‌ప్రింట్లపై దర్యాప్తు కొనసాగుతోంది. అయితే కేవలం విచారణ మాత్రమే చేయకుండా కచ్చితంగా అరెస్ట్ చేస్తేనే బెట్టింగ్ యాప్స్‌కి బ్రేక్ పడుతుందని జనం కోరుతున్నారు. మరి ఈడీ ఏం చేస్తుందో చూడాలి.

## ఫోన్‌ట్యాపింగ్ కేసులో కీలక మలుపు.. సుప్రీం కోర్టులో సిట్ పిటిషన్..!

- ఢిల్లీకి చేరుకున్న సిట్ ప్రత్యేక బృందం
- ప్రభాకర్‌రావుకు ఇచ్చిన మినహాయింపు రద్దుకు పిటిషన్
- విచారణకు ఆయన సహకరించడం లేదని ఆరోపణ
- కస్టోడియల్ విచారణకు అనుమతి కోరనున్న అధికారులు



**కృష్ణకుమార్, టీపీఎన్, స్పెషల్‌డెస్క్ :**

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మరింత వేగవంతం చేసింది. ఈ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు విషయంలో సిట్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయనకు సుప్రీంకోర్టు ఇచ్చిన మినహాయింపులను రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీ బాట పట్టారు. ఈ కేసు విచారణలో భాగంగా వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్, ఏసీపీ వెంకటగిరితో కూడిన సిట్ బృందం ఢిల్లీకి చేరుకుంది. ప్రభాకర్ రావు విచారణకు ఏమాత్రం సహకరించడం లేదని, ఆయనను కస్టడీలోకి తీసుకుని విచారిస్తేనే కీలక వాస్తవాలు వెలుగులోకి వస్తాయని సిట్ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆయన అరెస్ట్‌పై ఉన్న స్టేను ఎత్తివేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే ఐదుసార్లుగా దాదాపు 40 గంటల పాటు ప్రభాకర్ రావును సిట్ అధికారులు ప్రశ్నించారు. అయితే, ప్రతిసారీ ఆయన పొంతనలేని సమాధానాలు ఇస్తూ దర్యాప్తును తప్పుదోవ పట్టిస్తున్నారని అధికారులు పేర్కొంటున్నారు. పై అధికారుల ఆదేశాల ప్రకారమే తాను నడుచుకున్నానని ఆయన చెబుతుండగా, ఆయన ఆదేశాలతోనే తాము ఫోన్ ట్యాపింగ్ చేశామని ఇప్పటికే అరెస్టయిన ఇతర నిందితులు వాంగ్మూలం ఇచ్చారు. ఈ వైరుధ్యాల నేపథ్యంలో, ఆగస్టు 5 వరకు ప్రభాకర్ రావును అరెస్ట్ చేయరాదన్న సుప్రీంకోర్టు ఉత్తర్వులను రద్దు చేయించడం ద్వారా, కస్టోడియల్ విచారణకు మార్గం సుగమం చేసుకోవాలని సిట్ అధికారులు యోచిస్తున్నారు. ఈ తాజా పరిణామాలతో ఫోన్ ట్యాపింగ్ కేసు మరింత ఉత్కంఠగా మారింది.



# బెట్టింగ్‌కు బానిసై మహిళ ఆత్మహత్య!

**టీపీఎన్, హైదరాబాద్ :**

కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఒక దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సైబర్ మోసం మరియు బెట్టింగ్‌కు బానిసైన అనూష అనే మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అనూష తులసి నగర్‌లో తన భర్త వెంకన్న బాబుతో కలిసి నివసిస్తోంది. వీరికి ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. టెలిగ్రామ్‌లో వర్క్ ఫ్రమ్ హోం ద్వారా డబ్బు సంపాదించవచ్చని నమ్మిన అనూష, మొదట 1,000 రూపాయలు చెల్లించింది. అయితే, ఆ తర్వాత ఆమె సైబర్ మోసగాళ్ల చేతిలో మోసపోయి లక్ష రూపాయలు కోల్పోయింది. పోలీసుల దర్యాప్తులో అనూషకు బెట్టింగ్ చేసే అలవాటు ఉన్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో ఆమె ఇంట్లో ఉన్న బంగారాన్ని కూడా అమ్మినట్లు పోలీసులు తెలిపారు. డబ్బులు పోగొట్టుకోవడంతో కుటుంబ సభ్యులు ఏదైనా అంటారనే భయంతో అనూష మానసిక ఒత్తిడికి గురై, ఆత్మహత్య చేసుకుంది. కేపీహెచ్‌బీ పోలీసులు అనూష మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం చేసి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## కల్తీ కల్లు ఘటన, కాంగ్రెస్ పాలనపై
# కేటీఆర్ తీవ్ర విమర్శలు..!

- **కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనపై స్పందించిన కేటీఆర్**
- **మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్**
- **బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సూచన**
- **ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని స్పష్టీకరణ**

**టీపీఎన్, హైదరాబాద్ :**

కూకట్‌పల్లిలో వెలుగుచూసిన కల్తీ కల్లు ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన అత్యంత బాధాకరమని పేర్కొంటూ, బాధితుల పట్ల ప్రభుత్వం అనుసరించాల్సిన వైఖరిపై స్పష్టమైన డిమాండ్లు చేశారు. అదే సమయంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై సామాజిక మాధ్యమ వేదికగా తీవ్ర విమర్శలు గుప్పించారు.కల్తీ కల్లు ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న బాధితులకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి విషాదకరమైన సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు.'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ పాలనపై విమర్శలు గుప్పించారు. "ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ బుల్డోజర్" అంటూ ప్రస్తుత పాలనను అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను గాలికొదిలేసి, ప్రజలు అడగని బుల్డోజర్ పాలనను ముందుకు తెచ్చిందని ఆరోపించారు. పేదలకు రూ.4000 పెన్షన్, మహిళలకు మహాలక్ష్మి పథకం, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు వంటి కీలక హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. మహానగరం నుంచి మారుమూల పల్లెల వరకు బుల్డోజర్ రాజ్యం నడుస్తోందని, తెలంగాణ ప్రజలు మేల్కోవాలని "జాగో తెలంగాణ జాగో" అంటూ పిలుపునిచ్చారు.

## కల్తీ కల్లు బాధితులకు ఆరోగ్యశాఖ మంత్రి దామెదర రాజనర్సింహ పరామర్శ..!

**టీపీఎన్, నిమ్స్ :**



హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో కల్తీ కల్లు తాగి మొత్తం 44 మంది అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. కల్తీ కల్లు బాధితులను గురువారం నిమ్స్‌లో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పరామర్శించారు. డాక్టర్లను అడిగి బాధితుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బాధితులందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని నిమ్స్ డైరెక్టర్ బీరప్పను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి మాట్లాడారు. 40 మంది నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. అందరూ స్టేబుల్‌గా ఉన్నారని వెల్లడించారు. ఒక నలుగురికి డయాలసిస్ చేస్తున్నారని అన్నారు. ఒక నాలుగైదు రోజుల్లో అందరూ డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఘటనపై పూర్తిస్థాయిలో ప్రభుత్వం విచారణ చేయిస్తోందని, ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కాగా, కల్తీ కల్లు ఘటనలో మృతుల సంఖ్య 4కి చేరినట్లు సమాచారం. మరో బాధితురాలు నర్సమ్మ (54) ఈఎస్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.





## కల్తీ ఘటనపై ఎక్సైజ్‌శాఖ చర్యలు..
# ఆ కాంపౌండ్‌ల లైసెన్స్ రద్దు..!

- **అధికమోతాదులో అల్ఫాజోలం కలిపినట్లు నివేదిక..**
- **మత్తు రావాలని యజమానులు చేసిన నిర్వాకం..**
- **పోలీసులు అదుపులో 7మంది వ్యాపారులు**
- **రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలకు సిద్ధం.**

**టీపీఎన్, హైదరాబాద్ :**

కల్తీ కల్లు ఘటనపై ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. గత మూడు రోజులుగా కొనసాగుతున్న ఉద్రిక్తతల నడుమ హైదర్ నగర్, శమీమ్ గూడ, హెచ్ఎంటీ కాలనీతో పాటు బాలానగర్ ఎక్సైజ్ ఆఫీస్ పరిధిలోకి వచ్చే కల్లు కాంపౌండ్‌ల లైసెన్స్ రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. 44 మందిని ఆసుపత్రుల పాల్జేసి, నలుగురు మృతికి కారణమైన కల్లు కాంపౌండ్‌ల వద్ద శాంపిల్స్ సేకరించిన అధికారులు నారాయణగూడలో ఉన్న ల్యాబ్‌కి పంపించారు. అధిక మోతాదులో అల్ఫాజోలం ట్యాబ్లెట్లు కలపడం వల్లే వారంతా అస్వస్థతకు గురయ్యారని నివేదిక అందడంతో అధికారులు లైసెన్స్ రద్దు చేశారు. మిగతా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని కాంపౌండ్‌లలో నిత్యం శాంపిల్స్ సేకరించాలని ఉన్నతాధికారులు సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే ఈ కేసులో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఉండాలంటే కఠినంగా వ్యవహరించాలని అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. మరోవైపు ప్రతిపక్షాలు ప్రభుత్వ నిర్లక్ష్యం అని మండిపడుతున్నాయి. ముందుగానే అధికారులు చర్యలు తీసుకొని ఉంటే ఇలాంటి ఘటన జరిగి ఉండేది కాదని.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, సిబ్బందిపై వేటు వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# మల్నాడు కిచెన్ డ్రగ్స్‌పై ఈగల్ స్పెషల్ ఫోకస్..!

- **సిటీలో పలువురు డాక్టర్లకు ఇక్కడి నుండి డ్రగ్స్ సరఫరా..**
- **గోవా నుండి సప్లై అయినట్లు నిర్ధారణ..**
- **కిచెన్ యజమాని సూర్య అంతర్జాతీయ స్థాయిలో డ్రగ్స్ నడుపుతున్నట్లు ఆధారాలు..**

**కృష్ణకుమార్, టీపీఎన్, స్పెషల్ డెస్క్ :**




హైదరాబాద్‌లో సంచలనంగా మారిన మల్నాడు కిచెన్ డ్రగ్స్ కేసులో ఈగల్ టీమ్ ఫోకస్ పెంచింది. ఈ కేసు దర్యాప్తులో ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపింది. డ్రగ్స్ కి అలవాటు పడ్డ కస్టమర్ల లిస్ట్ సేకరిస్తోంది. అసలు ఈ మల్నాడు కిచెన్‌కు డ్రగ్స్ ఎలా చేరాయి? అక్కడ నుంచి ఎక్కడెక్కడికి డెలివరీ అయ్యాయి? ఇందులో ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయి అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. పలువురి డాక్టర్లకు కూడా మల్నాడు కిచెన్ నుంచి డ్రగ్స్ వెళ్లినట్లు ఈగల్ బృందం గుర్తించింది. గోవాలో నైజీరియా దేశస్థుడు నిక్ నుంచి కొకైన్, ఎండీఎంఏను మల్నాడు కిచెన్ యజమాని సూర్య డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు ఈగల్ టీమ్ విచరణలో బయటపడింది. గోవా నుంచి కొరియర్ల ద్వారా డ్రగ్స్ మల్నాడు కిచెన్‌ను వచ్చేవని.. అక్కడ నుంచి పబ్‌లు, ప్రముఖులకు అవి సప్లయ్ అయినట్లు ప్రత్యేక బృందం గుర్తించింది. మల్నాడు కిచెన్ యజమాని సూర్య అంతర్జాతీయ డ్రగ్స్ రాకెట్ నడుపుతున్నట్లు ఈ విచారణలో వెల్లడయింది. మల్నాడు కిచెన్ నుంచి ఆర్డర్ల వారీగా డ్రగ్స్‌ను సప్లయ్ చేసినట్లు ఈగల్ టీమ్ ఆధారాలు కూడా సేకరించింది. రెస్టారెంట్లతో పాటు హైదరాబాద్‌లో ఉన్న 20 పబ్బులకు ఇప్పటి వరకు డ్రగ్స్ సప్లయ్ అయ్యాయని, అలాగే పలువురు ప్రముఖులకు డోర్ డెలివరీ చేసినట్లుగా కూడా గుర్తించారు. ఈ ప్రముఖుల్లో హైదరాబాద్‌లోని కొందరు డాక్టర్లు కూడా ఉన్నట్లు ఈగల్ గుర్తించింది. డ్రగ్స్ కోసం హాస్పిటల్ ట్రీట్మెంట్ పేరుతో రూ. 1.8 లక్షల నగదు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు ఈగల్ టీమ్ గుర్తించింది. శ్రీ మారుతి కొరియర్ పేరుతో డ్రగ్స్ ప్యాకెట్లు సరఫరా అయ్యాయని.. ఆడవాళ్ల చెప్పుల హీల్స్ నుంచి కొకైన్, ఎక్స్‌టసీ పిల్స్, ఓజీ కుష్ ఆయిల్‌ను ఈగల్ టీమ్ స్వాధీనం చేసుకుంది. హైదరాబాద్‌లోని 15 మంది డాక్టర్లకూ కొరియర్ల ద్వారా సూర్య ఈ డ్రగ్స్ అందజేశాడు. మూడు పబ్‌ల యజమానులతో కలిసి అప్పుడప్పుడు డ్రగ్ పార్టీలు కూడా నిర్వహించినట్లు విచారణలో తేలింది. వచ్చే వారం ముగ్గురు పబ్ యజమానులు తమ ఎదుట హాజరుకావాలంటూ నోటీసులు అందించాలనే ఆలోచనలో ఈగల్ టీమ్ ఉంది

# రేవంత్‌రెడ్డికి వాస్తు భయం.. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో చర్చకు సిద్ధమా..?

- **సీఎం రేవంత్‌పై ఎమ్మెల్సీ కవిత ఫైర్**
- **వాస్తు భయంతోనే సెక్రెటేరియట్ కు వెళ్లడం లేదన్న కవిత**
- **ఇప్పటికే సీఎం చాంబర్ లో మార్పులు**

**టీపీఎన్, స్పెషల్ డెస్క్ :**



సీఎం రేవంత్ రెడ్డికి వాస్తు భయం పట్టుకుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. వాస్తు భయంతోనే రేవంత్ రెడ్డి సచివాలయానికి రావడం లేదని.. మీడియా ముందు మాత్రం సవాళ్లు విసురుతున్నారని కవిత విమర్శించారు. రేవంత్ రెడ్డి ఒక్కసారైనా 'జై తెలంగాణ' అన్నారా అని ప్రశ్నించారు. సెక్రటేరియట్ వాస్తు బాగలేదని, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులతో, అధికారులతో సమావేశాలు పెడుతున్న సీఎంను అడుగుతున్నారు. మహిళలకు ఇచ్చిన హామీలపై పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోనే చర్చ పెడుదామని, నిజంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేస్తే చర్చకు సిద్దపడాలని కవిత సవాల్ విసిరారు.

**నిజంగానే రేవంత్ కు వాస్తు భయమా?**

రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నపుడు కేసీఆర్ పై విమర్శలు గుప్పించారు. కానీ కేసీఆర్‌ని, బీఆర్ఎస్ పార్టీని ఓడించి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డికి వాస్తు భయాలు మొదలైనట్టు కనిపించాయి. అందుకే తెలంగాణ సచివాలయంలో వాస్తురీత్యా మార్పులకు రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సెక్రటేరియట్‌లోకి సీఎం ఎంట్రీ రూట్ కూడా మార్చారు. సెక్రటేరియట్‌లోని సీఎం కార్యాలయం 6వ అంతస్తు నుంచి 9వ అంతస్తుకు మారింది. అయినా రేవంత్ రెడ్డిలో భయం పోయిన్నట్టు లేదు. ఇప్పటికీ బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ నే తన శాఖలపై సమీక్షలతోపాటు సెంటర్‌లోనే మంత్రులు, అధికారులతో అధికారిక సమావేశాలు నిర్వహిస్తున్నారు. వందల కోట్లు ఖర్చు చేసి కొత్తగా నిర్మించిన సచివాలయంలో కాకుండా రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కీలకమైన సమావేశాలు నిర్వహిస్తుండటం గమనిస్తే వాస్తు భయం ఉందన్న ప్రచారం నిజమేనన్న వాదన ఉంది

# ఏసీబీ వలలో జహీరాబాద్ NIMZ అధికారులు..!

**టీపీఎన్, జహీరాబాద్ :**



సంగారెడ్డి జిల్లా, జహీరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ & మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ (NIMZ) కార్యాలయానికి చెందిన ముగ్గురు అధికారులను లంచం తీసుకుంటూ ఏసీబీ మెదక్ యూనిట్ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో చోటుచేసుకుంది. అరెస్ట్ చేసినవారిలో AO1 రాజా రెడ్డి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ (LA), AO2 సతీష్, డిప్యూటీ తహసీల్దార్, AO3 దుర్గయ్య, డ్రైవర్ ఉన్నారు.ఫిర్యాదుదారుని నుంచి రూ.15,000 లంచంగా స్వీకరిస్తుండగా AO2ని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అంతకుముందు, AO1 రూ.50,000, AO2 రూ.15,000 లంచం డిమాండ్ చేశారు. ఈ లంచం "హుసెల్లి గ్రామంలో ఫిర్యాదుదారునికి చెందిన 3 ఎకరాల 21 గుంటల భూమిని NIMZ కోసం స్వాధీనం చేసుకుని, సంబంధిత ఫైల్‌ను ప్రాసెస్ చేసి ముందుకు పంపినందుకు" డిమాండ్ చేయబడింది. ఫిర్యాదుదారునికి ఈ భూమి కోసం ఇప్పటికే రూ.52,87,500 చెక్కు అందినట్లు తెలుస్తోంది. లంచంగా ఇచ్చిన రూ.15,000ను AO2 వద్ద నుంచి ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. AO2 ఎడమ చేతి వేళ్లు మరియు ఆయన ధరించిన ప్యాంట్ ఎడమవైపు ముందు జేబుపై చేసిన కెమికల్ పరీక్షలో పాజిటివ్ ఫలితం వచ్చింది. అదే విధంగా, AO3 అయిన దుర్గయ్య, ఫిర్యాదుదారుని సహోదరుని పనిని పూర్తి చేయిస్తానని చెప్పి, రూ.1,00,000 లంచం డిమాండ్ చేశారు. దీంతో, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, హైదరాబాద్‌లోని నాంపల్లిలో అదనపు ప్రత్యేక న్యాయమూర్తి (SPE & ACB) ముందు హాజరుపరిచారు. ఈ కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉంది. డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న రాజారెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీకి అడ్డంగా దొరికిపోవడం చర్చనీయాంశంగా మారింది. చిన్నస్థాయి ఉద్యోగులను సరైన పద్ధతిలో నడిపించాల్సిన ఉన్నతాధికారులు కూడా లంచాలు తీసుకోవడమేంటంటూ ప్రజలు విమర్శిస్తున్నారు.

మరోవైపు లంచం డిమాండ్ చేస్తున్న ఏ ప్రభుత్వ ఉద్యోగి గురించి సమాచారం ఇవ్వాలనుకున్నా, ప్రజలు ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064ని సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు. అలాగే, ఏసీబీని సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా సంప్రదించవచ్చన్నారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

## నేడు సూర్యాపేట జిల్లాలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన..!

**టీపీఎన్, సూర్యాపేట :**

సూర్యాపేట జిల్లాలో శుక్రవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమాల వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 14న జరగనున్న ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లను పరిశీలించనున్నారు. మోతె మండలంలో ఎత్తిపోతల పథకం పురోగతిపై సమీక్ష నిర్వహించనున్నారు. రూ.5.10 కోట్ల వ్యయంతో కోదాడ పట్టణంలో నిర్మించనున్న నీటిపారుదల శాఖ కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేయనున్నారు. రూ.8 కోట్ల అంచనా వ్యయంతో చిలుకూరు మండల కేంద్రం నుంచి జెర్రిపోతుల గూడెం వరకు నిర్మించనున్న రహదారి పనులకు శంకుస్థాపన, హుజూర్‌నగర్ మండలంలో పలు రహదారులకు శంకుస్థాపన చేస్తారు. అలాగే హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి కోసం నిర్మించిన నూతన భవనం మరియు రక్తనిధి కేంద్రం ప్రారంభిస్తారు. విద్యుత్ డివిజనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ చేస్తారు. రూ.7.99 కోట్లతో నిర్మించనున్న నీటిపారుదల శాఖ కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేయనున్నారు. గరిడేపల్లి, కల్మల చెరువు మండలాల్లో పలు రహదారులకు శంకుస్థాపన చేస్తారు





## తల్లి ప్రియుడితో కలిసి తండ్రిని చంపిన కూతురు

**(మొదటి పేజీ తరువాయి)**

ఉన్నట్టు గుర్తించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఐతే.. పోలీసుల విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి.

**వివాహేతర సంబంధం పెట్టుకున్న కూతురు**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ కవాడిగూడ ముగ్గుల బస్తీకి చెందిన వడ్లూరి లింగం పాతబస్తీలోని ఒక అపార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. ఆయన భార్య శారద జీహెచ్ఎంసీలో స్వీపర్‌గా పని చేస్తోంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె మనీషాకు వివాహం చేయగా ఆమె వేరొక వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పరచుకోవడం వల్ల భర్త ఆమెను విడిచి పెట్టాడు.

**తండ్రిని అడ్డు తప్పించుకునేందుకు కూతురు ప్లాన్**

భర్త విడాకులు ఇవ్వడంతో.. మనీషా తాను వివాహేతర సంబంధం పెట్టుకున్న భర్త స్నేహితుడైన మహమ్మద్ జావీద్‌తో కలిసి మౌలాలిలో ఒక అద్దె ఇంట్లో ఉంటోంది. ఇక కూతురు తన సంసారాన్ని నాశనం చేసుకొని ప్రియుడితో కలిసి ఉంటుందని తెలుసుకున్న లింగం ఆమెను మందలించాడు. ఇదే సమయంలో తన తల్లిని కూడా అనుమానిస్తున్నాడు అని గుర్తించిన మనీషా.. తల్లితో కలిసి పక్కాగా ప్లాన్ వేసింది .తండ్రిని అడ్డు తప్పించుకోవాలని డిసైడైంది.

**తల్లి ప్రియుడితో కలిసి తండ్రిని హతమార్చిన కూతురు**

ఈ క్రమంలో జూలై 5వ తేదీన మనీషా నిద్రమాత్రలు ఇచ్చి తల్లిని కల్లులో కలిపి తండ్రికి ఇవ్వాలని సూచించింది. దీంతో తల్లి శారద నిద్రమాత్రలు కలిపిన కల్లును భర్తకు తాగించింది. ఆ పైన తండ్రి నిద్రలోకి జారుకోవడంతో కుమార్తె మనీషా, ఆమె ప్రియుడు జావీద్, తల్లి శారదతో కలిసి నిద్రమత్తులో ఉన్న తండ్రి లింగాన్ని హతమార్చారు.

**తండ్రిని చంపి సెకండ్ షో సినిమాకి..**

తండ్రి మరణించాడని రూఢీ చేసుకున్నాక.. తాపీగా ప్రియుడితో కలిసి మనీషా సెకండ్ షో సినిమాకి వెళ్లింది. అనంతరం క్యాబ్ బుక్ చేసుకుని వచ్చి తండ్రి కల్లు తాగి పడిపోయినట్లుగా క్యాబ్ డ్రైవర్‌ను నమ్మిస్తూ మృతదేహాన్ని తీసుకుని ముగ్గురు కలిసి ఎదులాబాద్ చెరువు దగ్గర దిగిపోయారు. తర్వాత మృతదేహాన్ని ఆ చెరువులో పడేశారు. అటుపై తండ్రి కనిపించటం లేదని మిస్సింగ్ కేసు నమోదు చేయించింది సదరు క్రిమినల్ కూతురు. దీనిపై దర్యాప్తు చేసిన పోలీసులు ఎదులాబాద్ చెరువు సమీపంలో ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించగా అసలు విషయం బయటపడింది. దీంతో ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టుకు పంపించగా.. న్యాయస్థానం వీరికి రిమాండ్ విధించింది.



## ఓరుగల్లు హస్తంలో అంతర్గత కల్లోలం..!

**టీపీఎన్, వరంగల్ :**

ఓరుగల్లు కాంగ్రెస్ నేతలు కొండా సురేఖపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవి, కొండా సురేఖను పిలిపించి వివరణ తీసుకున్న తర్వాత, ఇతర నేతలను కూడా పిలిపించారు. కొండా సురేఖ, కొండా మురళి దంపతులు ఈ నేతలపై ఫిర్యాదులు చేశారు. ఈ ఫిర్యాదులపై వివరణ తీసుకునేందుకు మల్లు రవి వారిని పిలిచారు.అయితే, ఈ చర్యపై కడియం శ్రీహరితో సహా ఇతర నేతలు మల్లు రవిపై మండిపడ్డారు. "మీరు సమస్యను పెంచుతున్నారా, పరిష్కరిస్తున్నారా తెలియడం లేదు" అని ప్రశ్నించారు. బహిరంగంగా విమర్శలు చేసి, మీడియా ముందు ఇష్టానుసారంగా మాట్లాడిన కొండా సురేఖపై చర్యలు తీసుకోకుండా, తమను పిలిచి ప్రశ్నించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. "కొండా దంపతులతో తిట్లు తిన్నది మేము, మళ్లీ మేమే వివరణ ఇవ్వాలా?" అని సీరియస్ అయ్యారు.

దీనికి సమాధానంగా మల్లు రవి, కొండా సురేఖపై వచ్చిన ఆరోపణలపై వివరణ తీసుకునేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేశామని కవర్ చేసుకున్నారు. అయితే, వరంగల్ నేతలు కొండా సురేఖ కావాలా, తాము కావాలా అని పార్టీ అధిష్ఠానానికి అల్టిమేటం ఇచ్చారు. కొండా సు రేఖను ఎవరూ హెచ్చరించడం లేదని, ఆమె క్రమశిక్షణను ఉల్లంఘిస్తున్నా కంట్రోల్ చేయడం లేదని వారు ఆరోపిస్తున్నారు.మరోవైపు, కొండా సురేఖ కుమార్తె పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నా కూడా, తానే కాబోయే ఎమ్మెల్యే అని ప్రచారం చేసుకుంటున్నారని.. దాన్ని అడ్డుకునే వారు లేరని అక్కడి నేతలు అసహనం వ్యక్తం చేశారు. మరోవైపు ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరూ పార్టీని వీడే అవకాశం లేదు, ఎందుకంటే స్థానిక సంస్థల ఎన్నికల బాధ్యతలు వారిపై ఉన్నాయి. అయితే, కొండా సురేఖ తమకు ఎన్ని నియోజకవర్గాల బాధ్యతలు ఇచ్చినా గెలిపించుకు వస్తామని చెబుతున్నారు. దీనికి విరుద్ధంగా, ఇతర నేతలు తమ నియోజకవర్గాల బాధ్యతలు కొండా సురేఖకు ఇవ్వొద్దని కోరుతున్నారు. జిల్లా మంత్రిగా ఉన్నప్పటికీ, తమ నియోజకవర్గాల్లో ఆమె జోక్యం చేసుకోవడానికి అవకాశం ఇవ్వొద్దని వారు డిమాండ్ చేస్తున్నారు. కొండా సురేఖ క్రమశిక్షణ ఉల్లంఘనలను పట్టించుకోకుండా, ఇతర నేతలను మాత్రమే పిలిచి వివరణ కోరడంపై వరంగల్ కాంగ్రెస్ నేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.






## కాంగ్రెస్, కమ్యూనిస్టుల అనుబంధం విడదీయరానిది..!

- మఖ్దూమ్ భవన్ పునఃప్రారంభ వేడుకలో టీపీసీసీ చీఫ్
- బీహార్‌లో ఎలిమినేషన్ ప్రక్రియ ప్రజాస్వామ్య విరుద్ధం
- బీజేపీ అధికారంలో వచ్చాక రాజ్యాంగబద్ధ సంస్థలు నిర్వీర్యం
- ఎలక్షన్ కమిషన్ కొందరి వ్యక్తులకు లాభం చేసే సంస్థగా మారడం దౌర్భాగ్యం
- దేశం భవిష్యత్ కోసం లౌకిక వాద శక్తులు బలపడాలి
- ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది

**టీపీఎన్, హైదరాబాద్ :**

సీపీఐ మఖ్దూమ్ కార్యాలయ పునః ప్రారంభ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మఖ్దూమ్ జీవితం, భావజాలం, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై తీవ్రంగా స్పందించారు. మఖ్దూమ్ జీవితం తెలుగు నేలకే కాదు, దేశ ప్రజలకు గొప్ప సందేశమని ఆయన అన్నారు. మఖ్దూమ్—సాహితీ, రాజకీయ వైభవానికి ప్రతీకగా నిలిచారని మహేష్ గారు గుర్తుచేశారు. "సింగరేణి కార్మికులతో ఆయనకు ఉన్న అనుబంధం ఎనలేనిది. బద్దం ఎల్లారెడ్డి, వెంకట్ రెడ్డి లాంటి యోధులతో కలిసి సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన ఘనత మఖ్దూమ్‌ది" అని ఆయన చెప్పారు. కేవలం కవి మాత్రమే కాక, మంచి నటుడిగా కూడా మఖ్దూమ్ పేరు తెచ్చుకున్నారన్న విషయాన్ని మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రముఖ విదేశీ రచయిత జార్జ్ బెర్నార్డ్ షా నాటకాలను ఉర్దూలోకి అనువదించిన వారిలో మఖ్దూమ్ ముఖ్యులని చెప్పారు.

1974 ఫిబ్రవరి 17న ప్రారంభమైన ఈ కార్యాలయానికి అప్పటి కాంగ్రెస్ మంత్రులే పునాది వేయడం మరో ప్రత్యేకతగా గౌడ్ గుర్తు చేశారు. "కాంగ్రెస్‌కమ్యూనిస్టుల అనుబంధం విడదీయరానిదని అన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం ఇద్దరు వేరు కాదని" ఆయన స్పష్టం చేశారు. కమ్యూనిస్టు భావజాలానికి మరణం లేదని, కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కొదవ లేదని వ్యాఖ్యానించిన మహేష్ కుమార్ గౌడ్, "అసెంబ్లీ ఎన్నికల్లో కమ్యూనిస్టులతో కలిసి పోటీ చేసి విజయాన్ని అందుకున్నాం. బలమైన లౌకిక శక్తులే దేశ భవిష్యత్‌కు భద్రత" అని గుర్తు చేశారు. ప్రస్తుతం దేశంలో కొనసాగుతున్న ఫాసిస్టు పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. "తమ పదవులను కాపాడుకునేందుకు ఫాసిస్టు శక్తులు ఎంత దూరమైనా వెళ్తున్నాయి. విద్యావంతులు సైతం హిందుత్వ కార్డును ఉపయోగించడం శోచనీయం. లౌకికత గురించి మాట్లాడితే అర్బన్ నక్సల్స్ అంటారు. ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడితే దేశద్రోహులమంటారు. ఇదే వారి తత్వం" అని ఉద్ఘాటించారు.

**ఆపరేషన్ కగార్ పై ఆగ్రహం**

ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం అడవుల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే ప్రయత్నం చేస్తోందని తీవ్రంగా మండిపడ్డారు. "మావోయిస్టులు చర్చలకు సిద్ధమని ప్రకటించినా కేంద్రానికి మానవత్వం లేకుండా సీజ్ ఫైర్ దాడులకు పాల్పడటం దారుణం. ఇందులో మహిళలు, పిల్లలు ప్రాణాలు కోల్పోయారు" అన్నారు. ఆపరేషన్ కగార్ పై రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడిన మరుసటి రోజే తనపై అర్బన్ నక్సలైట్, దేశద్రోహి ముద్ర వేయడం వెనుక కుట్రలు ఉన్నాయని వ్యాఖ్యానించారు.

**రాజకీయ స్వార్థాలకు ఎలక్షన్ కమిషన్ బలి**

దేశంలో ఎన్నికల సంఘం తీరుపై కూడా మహేష్ కుమార్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. "ఎలక్షన్ కమిషన్ కొందరి ప్రయోజనాలకు దాసోహంగా మారడం దురదృష్టకరం. బీహార్‌లో ఓట్ల ఎలిమినేషన్ ప్రక్రియ ఒకే పార్టీకి మేలు చేసేలా సాగింది. సుప్రీంకోర్టు దృష్టిలో ఉన్న ఈ అంశంపై INDIA కూటమి పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టింది. ప్రజాస్వామ్య పరిరక్షణకు అన్ని పార్టీలు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉంది" అన్నారు. ప్రధాని మోదీ ఎన్నికలకు ముందు వాగ్దానం చేసిన రెండు కోట్ల ఉద్యోగాల ప్రస్తావన చేస్తూ, "ఉన్న ఉద్యోగాలు తీసేసి, పబ్లిక్ సెక్టార్ యూనిట్లను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టే దిశగా కేంద్రం వెళ్తోంది" అని విమర్శించారు.

**సంఘటితంగా పోరాడాల్సిన సమయం**

ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని మళ్ళీ మిత్రపక్షాలకు గుర్తు చేశారు. "దేశ భవిష్యత్‌ను రక్షించాలంటే లౌకిక వాద శక్తులు బలపడాలి. ప్రజల హక్కులను కాపాడేందుకు పార్టీ, భావజాల భేదాలు మరిచి ముందుకు రావాలి" అని టిపిసిసి చీఫ్ పిలుపునిచ్చారు.



## బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్..1

**టీపీఎన్, హైదరాబాద్ :**

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్‌తో జూలై 2324న ఛలో ఢిల్లీ చేపట్టామని... అక్కడే జాతీయ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య తెలిపారు. హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో జాతీయ బీసీ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఏపీ అధ్యక్షులు బోను దుర్గ నరేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంపీ ఆర్.కృష్ణయ్య పాల్గొని చలో ఢిల్లీ జాతీయ సదస్సు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్లను జనాభా గ్రూపులుగా వర్గీకరణ చేయడానికి జస్టిస్ రోహిణి అధ్యక్షతన కమిటీ నియమించారని, ఆ రిపోర్ట్ ప్రకారం గ్రూపులు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రత్యేక సంక్షేమ పథకాల రూపకల్పన, అవసరమైన బడ్జెట్ కేటాయింపు, కార్యాచరణ ప్రణాళిక అమలులో ముందడుగు వంటివాటికి మార్గం సుస్పష్టం అవుతుందని అభిప్రాయపడ్డారు. స్థానిక సంస్థలలో రిజర్వేషన్ల స్థానాలను కేటాయించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు.

## ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలని డిమాండ్..!

**టీపీఎన్, హైదరాబాద్ :**



భద్రాచలం పట్టణాన్ని ఆనుకొని ఉన్న యటపాట, కన్నాయిగూడెం, గుండాల, పిచ్చుకలపాడు, పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి లేఖ రాశారు. ఉమ్మడి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత, పోలవరం ముంపు పేరుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను చీకటి ఆర్డినెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేయించుకున్నారని కవిత ఆరోపించారు. 2014లో ఎన్డీఏ ప్రభుత్వంలో కీలక పాత్రలో ఉన్న చంద్రబాబు నాయుడు, ఈ మండలాలను ఏపీలో విలీనం చేసుకునేందుకు పట్టుబట్టారన్నారు. దీంతో లోయర్ సీలేరు పవర్ ప్లాంట్‌ను లాగేసుకొని తెలంగాణలో విద్యుత్ కష్టాలకు కారణమయ్యారని తెలిపారు.

పోలవరం ప్రాజెక్టు పేరుతో భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయాన్ని ముంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆమె ఆరోపించారు. ఏడు మండలాలను ఏకపక్షంగా విలీనం చేసుకోవడంతో, భద్రాచలం పట్టణానికి అంతర్భాగంగా, ఆనుకొని ఉన్న యటపాట, కన్నాయిగూడెం, గుండాల, పిచ్చుకలపాడు, పురుషోత్తపట్నం గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. భద్రాచలం రాములవారి గుడి మన్యం భూములు పురుషోత్తపట్నం రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్నాయని కవిత పేర్కొన్నారు. రాములవారు తెలంగాణలో ఉంటే, ఆయన మన్యం భూములు ఏపీలో ఉండటంతో, ఆ భూములపై ఇష్టారాజ్యంగా కబ్జాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కబ్జాలను అడ్డుకునేందుకు ప్రయత్నించిన భద్రాచలం రామాలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమాదేవిపై కబ్జాదారులు దాడి చేసిన తీరు సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేసిందని ఆమె వెల్లడించారు. రాముడి పేరు చెప్పి కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు నాయుడు, రాములవారు కొలువైన భద్రాచలం పట్టణాన్ని పోలవరం ప్రాజెక్టులో ముంచే కుట్రలు చేస్తున్నారని కవిత ఆరోపించారు. ఈ ఐదు గ్రామాల ప్రజలు విద్య, వైద్యం, ఇతర సేవలు, ఉపాధి కోసం వందల కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.ప్రజల ఇబ్బందులను పరిష్కరించడంతో పాటు, భద్రాచలం రాములవారి భూముల పరిరక్షణ కోసం, యటపాట, కన్నాయిగూడెం, గుండాల, పిచ్చుకలపాడు, పురుషోత్తపట్నం గ్రామాలను వెంటనే తెలంగాణలో విలీనం చేయాలని కవిత డిమాండ్ చేశారు.



## గాంధీభవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమావేశం

**టీపీఎన్, హైదరాబాద్ :**

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గాంధీ భవన్‌లో ఉమ్మడి హైదరాబాద్ జిల్లా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ జిల్లా పార్టీ కమిటీల గురించి చర్చించినట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో 15 అసెంబ్లీ నియోజకవర్గాలు, 2 పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నాయని, వీటిపై చర్చ జరిగిందని వెల్లడించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పోటీ చేసినవారు, డీసీసీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ముఖ్య నాయకుల అభిప్రాయాలను సేకరించినట్లు తెలిపారు. నాయకులు సూచించిన పేర్లను తీసుకున్నామని చెప్పారు. కమిటీలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళలతో పాటు అన్ని కులాల వారికి ప్రాధాన్యత ఇవ్వాలని నాయకులు సూచించినట్లు వివరించారు. శుక్రవారం మూడు జిల్లాలకు సంబంధించిన అబ్జర్వర్లు, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో సమావేశం జరుగనుందని తెలిపారు. పార్టీలో మొదటి నుంచి ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత, ఇతర పార్టీల నుంచి వచ్చినవారికి రెండవ ప్రాధాన్యత ఇస్తామని, ఈ మేరకు జాబితా సిద్ధం చేస్తామని వెల్లడించారు. ఇన్‌చార్జ్‌లు జాబితా సమర్పించిన తర్వాత, టీపీసీసీ చీఫ్, ఇన్‌చార్జ్ అనుమతితో డివిజన్‌ల వారీగా సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని జగ్గారెడ్డి పేర్కొన్నారు.




## విద్యార్థులే దేశ భవిష్యత్‌కు పునాది : ఎంపీ ఈటల రాజేందర్

**టీపీఎన్, మేడ్చల్ :**

విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాలు కడిగి సన్మానించడం సంతోషకరమని, తల్లి మొట్టమొదటి గురువు, ఆ తర్వాత తండ్రి, జ్ఞానాన్ని నేర్పించేవారు గురువులని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా మేడ్చల్ జిల్లా అంత్వెల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని అంత్వెల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. 14 మంది విద్యార్థులు ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించారని, మేడ్చల్ మండలంలో టాపర్ ఈ ప్రభుత్వ పాఠశాల నుంచే 534 మార్కులతో వచ్చాడని పేర్కొన్నారు.పాశ్చాత్య సంస్కృతి వెనక్కి పరుగులు తీయవద్దని, అమెరికాలోనే ఇది మంచిది కాదని రుజువైందని చెప్పారు. ఉమ్మడి కుటుంబాలు గొప్పవని, తాతయ్య, నానమ్మలు పిల్లలకు విలువలు, సమాజం పట్ల బాధ్యతలను నేర్పిస్తారని, వారి అనుపస్థితిలో పిల్లలు పక్కదారి పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పేదరికం విద్యార్థుల ఎదుగుదలకు అడ్డంకి కాదని, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తే దేశం బాగుపడుతుందని అన్నారు. కాన్వెంట్ స్కూళ్లలో చదివిన లేదా ఉన్నత కుటుంబాల నుంచి వచ్చిన అధికారులకు పేదల సమస్యలు అర్థం కావని, కానీ పేదరికం నుంచి వచ్చిన అధికారులు సమస్యలను వెంటనే పరిష్కరిస్తారని తన అనుభవంతో చెప్పారు.తాను సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో చదివిన బిడ్డనని, అందుకే ప్రభుత్వ హాస్టళ్లలో చదివే పిల్లలకు సన్న బియ్యంతో తిన్నంత అన్నం అందించేలా జీవో తీసుకొచ్చానని వెల్లడించారు. పేదరికం జ్ఞానాన్ని పొందడానికి శాపం కాదని, చీకట్లను తొలగించి వెలుగును అందించే గొప్ప వ్యక్తులు గురువులని పేర్కొన్నారు.మార్కులు, చదువు మాత్రమే కాకుండా సమాజం పట్ల, మానవ సంబంధాల పట్ల ఎలా ఉండాలో గురువులు విద్యార్థులకు నేర్పాలని కోరారు. అప్పుడే సమాజం రుగ్మతల నుంచి బయటపడుతుందని ఈటల రాజేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నంద రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ సుదర్శన్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు శైలజ హరి, జగన్ గౌడ్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# స్టాండింగ్ కమిటీలో 14 అంశాలు, రెండు టేబుల్ ఐటమ్స్‌కు ఆమోదం

**టీపీఎన్, హైదరాబాద్:**

నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం 5వ స్టాండింగ్ కమిటీ సమావేశం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో జరిగింది. ఈ సమావేశంలో 14 అంశాలు మరియు రెండు టేబుల్ ఐటమ్స్‌కు సభ్యులు ఆమోదం తెలిపినట్లు మేయర్ వెల్లడించారు.

**స్టాండింగ్ కమిటీ ఎజెండా అంశాలు:**

1.సరూర్‌నగర్‌లోని పెద్ద ట్యాంక్ బండ్ మరమ్మతులు, బలోపేతం కోసం రూ.5.60 కోట్ల అంచనా వ్యయంతో షార్ట్ టెండర్ పిలవడానికి పరిపాలన అనుమతికి కమిటీ ఆమోదం.

2.తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (సికింద్రాబాద్)కు బుద్ధ భవన్ 4వ అంతస్తులో తూర్పు వైపు (7110 ఎస్ఎఫ్‌టీ, 19072025 నుంచి 18072028 వరకు), ఉత్తర వైపు (2500 ఎస్ఎఫ్‌టీ, 20082025 నుంచి 19082028 వరకు), దక్షిణ వైపు (2020 ఎస్ఎఫ్‌టీ, 01072025 నుంచి 30062028 వరకు) లీజుకు ఇవ్వడానికి కమిటీ ఆమోదం.

3.బుద్ధ భవన్‌లో హైడ్రా కార్యాలయానికి జీహెచ్ఎంసీ యాక్ట్ ప్రకారం ప్రభుత్వ ఉత్తర్వు నెం. 25, తేదీ 30012018 అనుసరించి 19082024 నుంచి 18082027 వరకు లీజుకు ఇవ్వడానికి కమిటీ ఆమోదం.

4.నల్లగుట్ట, న్యూ బోయిగూడ, ఔడయ్య నగర్, రాంగోపాల్‌పేటలోని లీజు భూములను ఫ్రీ హోల్డ్‌గా మార్చడానికి, కన్వేయన్స్ డీడ్ అమలు చేయడానికి కమిటీ ఆమోదం.

5.శాస్త్రిపురం ఆర్ఓబీ నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు (మెహఫిల్ హోటల్) వరకు రూ.495 లక్షల వ్యయంతో 100 ఫీట్ల రోడ్డు వెడల్పు చేయడానికి కమిటీ ఆమోదం.

6.వనస్థలిపురం నుంచి సాహెబ్ నగర్ మీదుగా ఓల్డ్ హయత్ నగర్ వరకు 18 మీటర్ల నుంచి 24 మీటర్ల రోడ్డు వెడల్పు చేయడానికి, మిస్సింగ్ లింక్ రోడ్డు నిర్మాణానికి 102 ఆస్తుల సేకరణకు మాస్టర్ ప్లాన్ కోసం ప్రభుత్వానికి తెలియజేసి కమిటీ ఆమోదం.

7.కూకట్‌పల్లి జోన్ మూసాపేట్ సర్కిల్, బాలాజీ నగర్ పరిధిలో కైతలాపూర్ ఫ్లైఓవర్ కింద స్పోర్ట్స్ ఏరియాలో ఓ అండ్ ఎం కోసం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ద్వారా బేస్ రేటు రూ.30,000 అద్దె చెల్లింపుతో ఒక సంవత్సరం కాలనీకి ఇవ్వడానికి కమిటీ ఆమోదం.

8.కమిషనర్‌కు ఉన్న కొన్ని అధికారాలను అడిషనల్ కమిషనర్ (అడ్మిన్)కు అప్పగించడానికి కమిటీ ఆమోదం.

9.జీహెచ్ఎంసీ కమిషనర్ అధికారాలను అడిషనల్ కమిషనర్ (ఫైనాన్స్)కు అప్పగించడానికి కమిటీ ఆమోదం.

10.సర్కిల్ 26లో గాజులరామారం గ్రామం సర్వే నెం. 307, 308లో జీహెచ్ఎంసీకి చెందిన భూమి రక్షణ కోసం రూ.585 లక్షల వ్యయంతో ప్రహరీ గోడ నిర్మాణానికి టెండర్లు పిలవడానికి కమిటీ ఆమోదం.

11.జీహెచ్ఎంసీ చట్టంలోని సెక్షన్ 450 & 455A కింద భవన నిర్మాణ అనుమతి దరఖాస్తుల ప్రాసెసింగ్ కోసం జోనల్, సర్కిల్ కార్యాలయాలకు కొన్ని అధికారాలు అప్పగించడానికి కమిటీ ఆమోదం.

ం(1): జీహెచ్ఎంసీ చట్టం 1955 సెక్షన్ 119 ప్రకారం కమిషనర్‌కు ఉన్న డెలిగేషన్ పవర్‌ను టీఎస్‌బీ పాస్ 2020 యాక్ట్ ప్రకారం ప్రభుత్వ ఉత్తర్వు నెం. 200, తేదీ 16112020 ప్రకారం తక్షణ రిజిస్ట్రేషన్, తక్షణ ఆమోదం కేటగిరీలో వర్క్ ప్రారంభం కాని అనుమతుల రద్దుకు డిప్యూటీ కమిషనర్‌కు అప్పగించడానికి ఆమోదం.

ం(2): టీఎస్‌బీపాస్ చట్టం నెం. 200, తేదీ 16112020 నిబంధనల ప్రకారం డిప్యూటీ కమిషనర్ జారీ చేసిన తక్షణ రిజిస్ట్రేషన్, తక్షణ ఆమోదం బిల్డింగ్ పర్మిషన్‌ల రద్దుకు జోనల్ కమిషనర్‌కు అనుమతి ఇవ్వడానికి కమిటీ ఆమోదం.

ం(3): సెక్షన్ 455/A కింద దాఖలైన దరఖాస్తులను క్రమబద్ధీకరణ కోసం పరిశీలించే అధికారాన్ని జోనల్ కమిషనర్‌కు అప్పగించడానికి కమిటీ ఆమోదం.

ం(4): సెక్షన్ 450, 455/A కింద మిగిలిన అధికారాలు కమిషనర్ వద్దనే ఉంటాయని కమిటీ ఆమోదం.

12.హెచ్‌కెఎం చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా ఇందిరమ్మ క్యాంటీన్‌లో బ్రేక్‌ఫాస్ట్ పథకం ప్రవేశపెట్టడానికి కమిటీ ఆమోదం. రూ.19/ బ్రేక్‌ఫాస్ట్ ధరలో లబ్ధిదారుడు రూ.5/ చెల్లించి, మిగిలిన రూ.14/ను జీహెచ్ఎంసీ గ్రాంట్‌గా మంజూరు చేయడానికి ఆమోదం. దీనికి 10x40 ఫీట్లు, 10x20 ఫీట్లు గల 79 కంటైనర్లు, 11 పాత క్యాంటీన్ సెంటర్లకు రూ.11.43 కోట్ల ఖర్చుకు ఆమోదం.

ంబి): జూలై మధ్య వారంలో రూ.3 కోట్లు, ఆగస్టు మొదటి వారంలో రూ.4 కోట్లు, ఆగస్టు చివరి వారంలో రూ.4.43 కోట్లు, మొత్తం రూ.11.43 కోట్లకు ఆమోదం.

ంసి): హెచ్‌కెఎం చారిటబుల్ ట్రస్ట్‌కు నీటి, విద్యుత్, డ్రైనేజీ కనెక్షన్‌లకు ఆమోదం.

ండి): బ్రేక్‌ఫాస్ట్ ఖర్చు రూ.19/లో లబ్ధిదారుని వాటా రూ.5/, జీహెచ్ఎంసీ గ్రాంట్ రూ.14/తో ఏడాదికి రూ.15.33 కోట్ల ఖర్చుకు ఆమోదం.

13.కూకట్‌పల్లి జోన్, మూసాపేట్ సర్కిల్, డీమార్ట్ సమీపంలో జీహెచ్ఎంసీకి చెందిన ప్లే గ్రౌండ్‌లో రెండు పికిల్ బాల్ కోర్టులు, ఒక వాలీబాల్ కోర్టు, ఒక యోగా హాల్ ఆపరేషన్, నిర్వహణ కోసం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ద్వారా నెలకు రూ.1 లక్ష ఆఫ్‌సెట్ ధరతో ఏడాదికి ఇవ్వడానికి కమిటీ ఆమోదం.

14.కూకట్‌పల్లి జోన్, మూసాపేట్ సర్కిల్, బీపీహెచ్‌బీ కాలనీలో మంజీరా పైప్‌లైన్, 7వ దశలో కైలాస వాసం హిందూ శ్మశాన వాటిక ఆపరేషన్, నిర్వహణ కోసం హెచ్1 బిడ్డర్ రాజేశ్వర రామరాజుకు ఇవ్వడానికి ఆమోదం. మరణించిన వ్యక్తికి జీహెచ్ఎంసీ వాటా రూ.2000/ చెల్లించడానికి ఆమోదం.

**టేబుల్ ఐటమ్స్:**

1.23 ఫుట్ ఓవర్ బ్రిడ్జిల (FOBలు) నిర్వహణ కోసం 23 వ్యక్తిగత ప్యాకేజీలలో 5 సంవత్సరాల లైసెన్స్ వ్యవధికి టెండర్లు పిలవడానికి అనుమతి. సంవత్సరానికి రూ.1359 లక్షల ఏకీకృత అప్సెట్ ధరతో, సంతృప్తికర పనితీరు ఆధారంగా 5 సంవత్సరాల పొడిగింపుకు కార్పొరేషన్‌కు సిఫార్సు చేయడానికి ఆమోదం.

2.మౌలాలి, దర్గా వద్ద రోడ్డు/ర్యాంప్ నిర్మాణం కోసం EPC వ్యవస్థ కింద మిడ్‌ల్యాండింగ్ స్టెప్స్ నుంచి హిల్ టాప్, మల్కాజ్గిరి సర్కిల్ (ఫేజ్II) వరకు రూ.27.50 కోట్ల సవరించిన పరిపాలన అనుమతికి ఆమోదం. ఇది అసలు రూ.25 కోట్ల కంటే రూ.2.50 కోట్ల అధికం. M/s YVR ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో అదనపు వస్తువుల అమలుకు కమిటీ ఆమోదం.

ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, పర్వీన్ సుల్తానా, డా.ఆయేషా హుమేరా, మహమ్మద్ సలీం, బాత జబీన్, మహాలక్ష్మి రమన్ గౌడ్, సీఎన్ రెడ్డి, మహమ్మద్ బాబా ఫసియుద్దీన్, వి.జగదీశ్వర్ గౌడ్, బూరుగడ్డ పుష్ప, జీహెచ్ఎంసీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# రెండు కాలనీలను కలిపిన హైడ్రా..!

**టీపీఎన్, హైదరాబాద్ :**

రెండు కాలనీల మధ్య దూరాన్ని హైడ్రా తగ్గించింది. అడ్డు గోడను తొలగించి అనుసంధానం ఏర్పాటు చేసింది. హబ్సీగూడలో స్ట్రీట్ నంబరు 6 లోఉన్న అడ్డు గోడ తొలగడంతో నందనవనం, జయానగర్ కాలనీల మధ్య దూరం తగ్గింది. ఇప్పుడు నందనవనంలోని స్ట్రీట్ నంబరు 4 నుంచి నేరుగా 6లోకి వచ్చి హబ్సీగూడ ప్రధాన రహదారికి చేరుకుంటున్నారు. గురువారం ఉదయాన్నే స్ట్రీట్ నంబరు 6లో ఉన్న అడ్డుగోడను హైడ్రా తొలగించింది. ఈ అడ్డుగోడ తొలగడంతో కేవలం 300 మీటర్లు ప్రయాణించి ఎన్‌జీఆర్ఐ మెట్రో స్టేషన్‌కు చేరుకుంటున్నామని నందనవనం కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. లేదంటే ఒకటిన్నర కిలోమీటర్లు ప్రయాణించి నానా అవస్థలు పడేవాళ్లమని.. ఇప్పుడా ఇబ్బంది తొలగిందన్నారు. 15 ఏళ్లుగా అవస్థలు పడుతున్నాం... ఎన్నో సార్లు మున్సిపల్ అధికారులను కలిసాం ప్రయోజనం లేకుండా పోయింది. ఆఖరకు జయానగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడినా జగడమే కాని.. సమస్య పరిష్కారం కాలేదు. ఇదే విషయమై హైడ్రాకు ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో వెంటనే పరిష్కారం దొరికిందని నందనవనంలోని కాంక్రీట్ ట్రంపెట్ అపార్టుమెంటు వాసులు చెబుతున్నారు.



# వృద్ధురాలిని దోచుకున్న ఇద్దరు అరెస్టు.!

**టీపీఎన్, హైదరాబాద్ :**

పిల్లల నకిలీ కరెన్సీ నోట్లతో నగదు దోపిడీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను కమిషనర్ టాస్క్ ఫోర్స్, సౌత్ వెస్ట్ జోన్ మరియు మంగళహాట్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. నిందితులు యాకుత్‌పురకు చెందిన సయ్యద్ వసీముద్దీన్ (34) మరియు వట్టేపల్లికి చెందిన మొహద్ ఆజమ్ అలీ అలియాస్ ఇమ్రాన్ (34). వీరు మంగళహాట్ మరియు ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వృద్ధ మహిళలను మోసం చేసినట్లు తెలిసింది. పోలీసులు వారి నుంచి ₹20,000 నగదు మరియు ₹1.2 లక్షల విలువైన ప్యాసింజర్ ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

ఇద్దరూ ఆటో డ్రైవర్లుగా పనిచేస్తూ, హైదరాబాద్‌లోని ఆటో లేన్‌లో స్నేహితులుగా మారారు. మద్యం మరియు ధూమపాన వ్యసనాల కారణంగా త్వరగా డబ్బు సంపాదించాలని కుట్ర పన్నారు. వారు చార్మినార్‌లోని ఒక దుకాణం నుంచి పిల్లల ఆట నోట్లు (₹500 నకిలీ నోట్లు) కొనుగోలు చేసి, వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకున్నారు. వారి బాధితుల్లో ఒకరు ఎస్బీఐ బ్రాంచ్ నుంచి నగదు ఉపసంహరించుకున్న మహిళ. ఆమెకు లిఫ్ట్ ఇస్తామని చెప్పి, ఆమె హ్యాండ్‌బ్యాగ్‌ను బలవంతంగా తీసుకుని, నిజమైన డబ్బును నకిలీ నోట్లతో మార్చారు.మంగళహాట్‌లో క్రైం నెం. 246/2025 మరియు ఆసిఫ్ నగర్‌లో క్రైం నెం. 153/2025 కింద భారతీయ న్యాయ సంహిత (BNS) సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేయబడ్డాయి. ఈ అరెస్టులు ఇన్‌స్పెక్టర్ జి. సంతోష్ కుమార్ మరియు అడిషనల్ ఇన్‌స్పెక్టర్ పి. మహేందర్ పర్యవేక్షణలో జరిగాయి.

# ఉజ్జయిని మహంకాళి బోనాలకు భారీ బందోబస్తు..!



**టీపీఎన్, సికింద్రాబాద్ :**

ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాల నేపథ్యంలో శాంతిభద్రత దృష్ట్యా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఉత్తర మండల డీసీపీ రష్మి పెరుమాళ్ తెలిపారు. అమ్మవారి బోనాల జాతర జయప్రదం చేసేందుకు వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించినట్లు వెల్లడించారు. పోలీసు శాఖ తరపున 2000 మంది సిబ్బంది బోనాలు, రంగం కార్యక్రమంలో బందోబస్తు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు, బోనాలతో వచ్చే మహిళలకు మొత్తం ఆరు క్యూ లైన్లు ఏర్పాటు చేసినట్లు అందులో బోనాల కోసం ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రతతో పాటు నూతనంగా 40 సీసీ కెమెరాలు కూడా పెంచినట్లు వెల్లడించారు. ఈ ఏడాది కూడా డీజేలకు అనుమతి లేదని, ఫలహారం బండ్లు ఊరేగించేవారు తమను సంప్రదిస్తే వారికి బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. భక్తుల వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ వసతి కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. జూలై 13, 14వ తేదీలలో జరిగే బోనాల ఉత్సవాలకు ప్రజలు తరలిరావాలని ఆహ్వానించారు. బోనాలతో వచ్చే మహిళలను, పిల్లలను, కుటుంబ సభ్యులను బొనాల క్యూ లైన్‌లో అనుమతిస్తామని తెలిపారు. బోనాల రోజు బాటా కూడలి నుండి మధ్యాహ్నం ఒంటిగంట నుండి మూడు గంటల వరకు శివసత్తులు, జోగినిలకు ప్రత్యేక దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు.



# మేడ్చల్ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి ప్రత్యేక పూజలు..!

**టీపీఎన్, హైదరాబాద్ :**

మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ గురుపౌర్ణమి సందర్భంగా మేడ్చల్ సాయిబాబా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా గురుపౌర్ణమి ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటున్న అందరికీ ఈటల రాజేందర్ శుభాకాంక్షలు తెలిపారు. నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మేడ్చల్ సాయిబాబా దేవాలయ కమిటీకి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కోలాటం (దాండియా) ఆడిన మహిళలకు కూడా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ సుదర్శన్ రెడ్డి, మున్సిపల్ ప్రెసిడెంట్ హరి శైలజ, జగన్ గౌడ్ మరియు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సీరియల్ దొంగ అరెస్టు, రూ.31 లక్షల విలువైన బంగారం స్వాధీనం..!

**టీపీఎన్, హైదరాబాద్ :**

కమిషనర్ టాస్క్ ఫోర్స్, సౌత్ వెస్ట్ జోన్, రాచకొండ కమిషనరేట్‌కు చెందిన ఎల్బీ నగర్ పోలీసులతో సమన్వయం చేసుకుని, రాత్రి సమయాల్లో ఇళ్లలో చోరీలకు పాల్పడే ఒక సీరియల్ దొంగను అరెస్టు చేశారు. నిందితుడు జగనాథం ప్రభు (33), ఉప్పర్‌పల్లిలో నివసిస్తున్న ఒక మేస్త్రీగా గుర్తించారు. ఎల్బీ నగర్, ఉప్పల్, మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో అనేక దొంగతనాలతో ఈయన సంబంధం ఉన్నట్లు తెలిసింది. అతని వద్ద నుంచి 31.456 తులాల దాదాపు రూ.31 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.నిజామాబాద్ జిల్లాలోని వడ్డేపల్లి స్వస్థలంగా ఉన్న ప్రభు, సైబరాబాద్‌లో ఇళ్లలో చొరబడి బంగారు దొంగతనాలకు పాల్పడుతున్నాడు. గతంలో నార్సింగి పోలీసులు అరెస్టు చేసినప్పటికీ, 2025 మేలో బెయిల్‌పై విడుదలైన తర్వాత కూడా ఆయన తన నేర కార్యకలాపాలను మార్చుకోకుండా కొనసాగించాడు. రాత్రి సమయాల్లో ఇళ్లలో చొరబడి నగదు, బంగారం దొంగిలించడం ద్వారా అనేక చోరీలకు పాల్పడ్డాడు.ఎల్బీ నగర్, ఉప్పల్, మైలార్‌దేవ్‌పల్లిలో ఆయనపై బీఎన్ఎస్ వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు అయ్యాయి. గతంలో 2013 నుంచి రాజేంద్రనగర్, శామీర్‌పేట్, నార్సింగి, బహదూర్‌పుర పోలీస్ స్టేషన్లలో కూడా దొంగతనం కేసుల్లో ఆయన పాల్గొన్నాడు. ఈ అరెస్టు సౌత్ వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జి. సంతోష్ కుమార్, ఎల్బీ నగర్ ఇన్‌స్పెక్టర్ కె. వినోద్ కుమార్ మరియు వారి బృందాల పర్యవేక్షణలో జరిగింది.



# రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి..!

**టీపీఎన్, మేడ్చల్ :**

చిన్న చిన్న సమస్యలను పరిష్కరించి రోడ్డు ప్రమాదాలను నివారించడమే కాకుండా ప్రజల ప్రాణాలను కాపాడవచ్చని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా రోడ్డు భద్రత కమిటీ ఛైర్మన్ రాధికాగుప్తా అన్నారు. మేడ్చల్ కలెక్టరేట్ మిని మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. జిల్లాలోని సమస్యాత్మకమైన, మరమ్మతులు అవసరమైన రోడ్ల వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అదనపు కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత సమావేశంలోని సమస్యలను ఎంత వరకు పరిష్కరించారని.. ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నవని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట ఎలక్ట్రిక్ పోల్స్‌ను షిఫ్ట్ చేసి రోడ్డు విస్తీర్ణం పెంచాలని, రోడ్డు ఇరువైపుల ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రోడ్లు, భవనాల అధికారి, జిల్లా రవాణా అధికారి, ట్రాఫిక్ అదనపు డీసీపీ, ఏసీపీ సైబరాబాద్, కూకట్‌పల్లి, మేడ్చల్, మునిసిపల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**టీపీఎన్, జూబ్లీహిల్స్ :**

నియోజకవర్గంలోని రహమత్ నగర్ డివిజన్‌లో బస్తి బాట కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) చెక్కులను లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. కార్మిక నగర్‌కు చెందిన హసీనాకు రూ.47,500, హెచ్ఎఫ్ నగర్‌కు చెందిన మహమ్మద్ అతీక్‌కు రూ.35,500, మహమ్మద్ షరీఫ్‌కు రూ.37,500, రహమత్ నగర్‌కు చెందిన సాబేరా బేగానికి రూ 50,000 చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి పథకం పేదలకు వరం లాంటిదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం మరియు ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు పాల్గొన్నారు.




# బాత్రూమ్‌లో శిశువు మృతదేహం..!

**టీపీఎన్, నిమ్స్ :**

హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో గురువారం మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో దారుణ సంఘటన వెలుగులోకి వచ్చింది. ఒక తల్లి తాను తొమ్మిది నెలలు మోసి కన్న బిడ్డను బాత్‌రూమ్‌లోని మ్యాన్‌హోల్‌లో పడేసి వెళ్లిపోయిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనపై నిమ్స్‌లోని పలువురు తల్లులు "బిడ్డపై కాస్తంతైనా జాలి లేని ఆ తల్లి ఎంతటి కఠినమైన మనస్తత్వం కలిగి ఉంటుంది" అంటూ తలవంచుకున్నారు.వివరాల్లోకి వెళితే, నిమ్స్ ఆసుపత్రిలోని ఆర్థోపెడిక్ విభాగం సమీపంలో ఉన్న పాత ఓపీ రూమ్ నంబర్ 19 వద్ద మహిళల కోసం ఏర్పాటు చేసిన బాత్‌రూమ్‌లో వాటర్ జామ్ అయినట్లు గుర్తించారు. దీనిని సరి చేయాలని నిమ్స్ యాజమాన్యం పారిశుద్ధ్య కార్మికులకు సూచించింది. సిబ్బంది మ్యాన్‌హోల్ తెరిచి తనిఖీ చేస్తుండగా, అందులో ఒక శిశువు కాలు కనిపించింది. బయటకు తీసి చూడగా, సుమారు 5 నెలల శిశువు మృతదేహంగా కనుగొన్నారు.వెంటనే ఈ విషయం పంజాగుట్ట పోలీసులకు సమాచారం అందించారు. శిశువు మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. మహిళల బాత్‌రూమ్‌లోకి ఈ శిశువును ఎవరు తీసుకొచ్చి మ్యాన్‌హోల్‌లో పడేశారన్న విషయంపై పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోకి అక్రమంగా చొరబాటు..!

**టీపీఎన్, మహేశ్వరం :**



మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని లెనిన్ నగర్ సర్వే నెంబర్ 119లో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి వెంటనే కేటాయించాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు భవనంలోకి చొరబడి ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో గుడిసెలను తొలగించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అయితే, ఏడేళ్లు గడిచినా ఈ ఇళ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో బాధితులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమకు కేటాయించిన ఇళ్లను అందజేసే వరకు తాము ఇక్కడి నుంచి కదలమని లబ్ధిదారులు భవనంలో కూర్చొని నిరసన తెలిపారు. గతంలో పట్టాలు ఇచ్చినప్పటికీ, నేటికీ ఇళ్లను కేటాయించకుండా అధికారులు మభ్యపెడుతున్నారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ ఇళ్లను కేటాయించాలని కోరుతూ, అసంపూర్తిగా ఉన్న భవనంలోకి చొరబడి నిరసన చేపట్టారు. మరికొందరు స్థానిక లబ్ధిదారులు డబ్బులు తీసుకొని ఇళ్లను కేటాయిస్తున్నారని ఆరోపించారు. ఈ అన్యాయాన్ని నిరసిస్తూ వారు కూడా నిరసన చేపట్టారు.

# మార్కెటింగ్ విభాగంలో నర్మదాకు జాతీయ పురస్కారం

**టీపీఎన్, హైదరాబాద్ :**



యాదాద్రి భువనగిరి జిల్లా, సంస్థాన్ నారాయణపురం మండలం, పుట్టపాకకు చెందిన నర్మదా అనే మహిళ 2024 జాతీయ చేనేత పురస్కారానికి మార్కెటింగ్ విభాగంలో ఎంపికయ్యారు. ఈ పురస్కారాన్ని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా స్వీకరించనున్నారు. ఈ అవార్డును ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి నర్మదా, ఆమె భర్త నరేందర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.నరేందర్ హ్యాండ్లూమ్స్ పేరుతో హైదరాబాద్‌లోని కొత్తపేటలో చేనేత వస్త్రాల వ్యాపారం నిర్వహిస్తున్న నర్మదా, 300 మంది చేనేత కార్మికులతో ఎనిమిది కోట్ల రూపాయల విలువైన చేనేత వస్త్రాలను విక్రయించారు. ఈ కృషి ఆమెను జాతీయ పురస్కారానికి అర్హురాలిగా నిలిపింది. 2023 నుంచి పుట్టపాక, నల్గొండ జిల్లాలోని 300 చేనేత కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ, ప్రాచీన చేనేత వృత్తిని కాపాడేందుకు ఆమె తన భర్త నరేందర్ సహకారంతో కృషి చేస్తున్నారు. మార్చి 17న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎదుట నర్మదా మగ్గంపై వస్త్రం నేసి తన ప్రతిభను ప్రదర్శించారు. సహజ సిద్ధమైన రంగులతో చీరలను తయారు చేస్తూ, కస్టమర్ల అభిరుచికి తగ్గట్టుగా ప్రత్యేక డిజైన్లను రూపొందిస్తున్నట్లు ఆమె తెలిపారు. పది రాష్ట్రాల్లో మార్కెట్‌ను విస్తరించిన నర్మదా.. భవిష్యత్తులో మరింతమందికి ఉపాధి కల్పించి వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక డిజైన్లకు సంబంధించిన సమాచారం అందిస్తే, ఆ దిశగా ప్రయత్నాలు చేస్తామని నరేందర్ తెలిపారు.

లక్ష రూపాయల పెట్టుబడితో ప్రారంభమైన ఈ వ్యాపారం నేడు ఎనిమిది కోట్ల రూపాయల టర్నోవర్‌కు చేరుకుంది. ఈ అవార్డు తమపై మరింత బాధ్యతను పెంచిందని, ఎన్నో ఒడిదుడుకులు, కష్టాలను ఎదుర్కొని ఈ స్థాయికి చేరుకున్నామని నర్మదా, నరేందర్ దంపతులు తెలిపారు. తన తండ్రి స్ఫూర్తితో ఈ రంగంలో రాణిస్తున్నామని నరేందర్ పేర్కొన్నారు. మహిళలను ప్రోత్సహిస్తే వారు అన్ని రంగాల్లో విజయం సాధించగలరని, నర్మదా జాతీయ పురస్కారానికి ఎంపిక కావడం తనకు గర్వకారణమని నరేందర్ అన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ దంపతులు ధన్యవాదాలు తెలిపారు.



# గురు పూర్ణిమ సందర్భంగా పలువురు గురువులకు సన్మానం..!

**టీపీఎన్, గోదావరిఖని :**

గురు పౌర్ణమి పురస్కరించుకుని గోదావరిఖని పట్టణంలోని స్థానిక జీఎం కాలనీ క్రీడా మైదానంలో వివిధ క్రీడా రంగాలకు చెందిన గురువులకు ఘనంగా సన్మానం చేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ ఆధ్వర్యంలో వివిధ క్రీడల్లో సేవలందిస్తున్న గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ కుమార్ మాట్లాడుతూ.. గురువులను సన్మానించడం గౌరవంగా భావిస్తున్నానన్నారు. కళలకు నిలయమైన కోల్‌బెల్ట్ ప్రాంతంలో క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన చేసి విజేతలుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అందుకు ప్రధాన కారణం ఈ ప్రాంత గురువులేనని చెప్పారు. వారి శిక్షణలో వేలాది మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించారని.. గోదావరిఖని ప్రాంత విజేతలు క్రీడల్లో నైపుణ్యం వల్ల పోలీస్, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తున్నారన్నారు. ఈ విజేతలకు నిత్యం శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్న గురువులను సన్మానించడం అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చ ప్రధాన కార్యదర్శి కాసిపేట శివాజీ, బీజేపీ జనగామ మండల అధ్యక్షుడు జీ భూమయ్య, సీనియర్ నాయకులు మహవాది రామన్న, జనహిత శ్రీను, ఈ ఉపేందర్, శ్రీనాథ్, విశ్వనాథ్, తడగొండ నర్సయ్య, ఎస్ హరీష్, కల్లెపల్లి శ్రీనివాస్, బియ్యాల మహేందర్, మేడగోని రవి, రాజు, చంద్రశేఖర్, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# గురుపౌర్ణమి రోజున గురువులకు సన్మానం..!

**టీపీఎన్, మేడ్చల్ జిల్లా :**

ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని.. క్రమశిక్షణతో చదువుపై ఏకాగ్రత పెంపొందించుకోవాలని కోలా రవీంద్ర ముదిరాజ్ చెప్పారు. షాపూర్‌నగర్‌లో గురు పౌర్ణమి సందర్భంగా భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం శాఖ అధ్యక్షులు ఈసీహెచ్ చారి, కార్యదర్శి కోల రవీందర్ ముదిరాజ్, హెడ్‌మాస్టర్ తిరుపతి రెడ్డి, ఎంఈవో జెమినీని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం కోట్ల రూపాయలు ఖర్చుపెడుతోందని.. డ్రెస్సులు, పుస్తకాలు, మధ్యాహ్న భోజనాలు అందిస్తుందని.. దీనిని ఉపయోగించుకోవాలన్నారు. ఇక్కడ బీఎస్సీ, బీఈడీ కలిగిన ఉపాధ్యాయులతో విద్యా అందిస్తున్నామని.. శ్రద్ధగా విని ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని.. మంచిగా చదువుకుంటే ప్రభుత్వ పాఠశాలలో చేరే విద్యార్థులకు 90 శాతం ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని ఆమె తెలిపారు. ఎవరైనా దాతలు ఉన్నట్లయితే సహకరించి ఈ పాఠశాల అభివృద్ధి కోసం తోడ్పడాలని.. తాము తమ శాయశక్తులా విద్యార్థులను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

# ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సులో అగ్నిప్రమాదం..!

**టీపీఎన్, కిష్టారెడ్డిపేట :**




అమీన్‌పూర్ మున్సిపాలిటీ, కిష్టారెడ్డిపేటలోని కళ్యాణి ఎస్టేట్స్ వద్ద ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన ఒక బస్సులో మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సు విద్యార్థులను ఎక్కించుకుంటున్న సమయంలో ఈ ఘటన జరిగింది. బస్సు కింద నుంచి పొగలు, నిప్పురవ్వలు వస్తున్నాయని గమనించిన వాచ్‌మెన్ వెంటనే బస్సు డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి, బస్సులో ఉన్న ఐదుగురు విద్యార్థులను సురక్షితంగా బయటకు దించేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అయితే, అప్పటికే బస్సు పాక్షికంగా కాలిపోయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ బస్సు పటాన్‌చెరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బ్రాంచ్‌కు చెందినదని స్థానికులు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో సదుపాయాలు అందిస్తుందని పేరున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సులో ఇలాంటి ఘటన జరగడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీవో అధికారులు వాహనాల తనిఖీలను సరిగా నిర్వహించడం లేదని, వారి నిర్లక్ష్యం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. "ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అంటేనే అత్యున్నత ప్రమాణాలు, అంతర్జాతీయ స్థాయి సదుపాయాలు ఉంటాయని చెబుతారు. అలాంటి పాఠశాల బస్సులోనే ఇలాంటి ప్రమాదం జరగడం ఆందోళన కలిగిస్తోంది. పిల్లల భద్రతకు సంబంధించి అధికారులు మరింత కఠినంగా వ్యవహరించాలి. నిబంధనలను పక్కాగా అమలు చేయాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసే బాధ్యత అధికారులపైనే ఉంది" అని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల భద్రత విషయంలో అధికారులు ఎటువంటి అలసత్వం వహించకూడదని వారు స్పష్టం చేశారు. ఈ ఘటన వాహనాల ఫిట్‌నెస్ తనిఖీల ఆవశ్యకతను మరోసారి గుర్తు చేసింది. ముఖ్యంగా పాఠశాల బస్సుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని ఈ సంఘటన గుర్తు చేస్తోంది.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి..!

**టీపీఎన్, వికారాబాద్:**



విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని ఉపాధ్యాయుల్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. వికారాబాద్ మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్ మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లల సంఖ్య, వారి రోజువారీ హాజరు, గుడ్లు, పాలు, బాలమృతం ప్లస్ అందిస్తున్నారా, వికలాంగ పిల్లలు, తీవ్రమైన లేదా అతితీవ్రమైన పోషకాహార లోపం ఉన్న పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, పిల్లలకు యూనిఫామ్‌లు వేయించి, చార్ట్‌లపై రాసి చదివించాలని సూచించారు.పాఠశాలలో 8వ మరియు 10వ తరగతి తరగతి గదులను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులతో ముచ్చటించారు. ఇంగ్లీష్, హిందీ సబ్జెక్టులపై వివరాలు అడిగి, ఇంగ్లీష్‌పై పట్టు సాధించాలని సూచించారు. విద్యార్థులతో ఇంగ్లీష్ కవితలు చదివించారు. 8వ తరగతి విద్యార్థులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (IFP) ద్వారా ఉపాధ్యాయుడు బోధిస్తున్న విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులు పోటీతత్వంతో చదివి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని విద్యార్థుల గదులు, మరుగుదొడ్లు, వంటగది, కొత్తగా నిర్మించిన డైనింగ్ హాల్‌ను తనిఖీ చేశారు. వంట తయారీ విధానం, స్టాక్ రిజిస్టర్, స్టోర్ రూమ్‌లోని బియ్యం, వంట సరుకులను స్వయంగా పరిశీలించారు.కలెక్టర్ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. పాఠశాలలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఈ సంవత్సరం మెరిట్ మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, ఎం.ఈ.ఓ బాబు సింగ్, ప్రధాన ఉపాధ్యాయుడు శివ కుమార్, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు లక్ష్మి పాల్గొన్నారు.

## AI విప్లవానికి గ్రాఫిటీ సహకారం..

# భారత్‌కు పిలుపు..!

**టీపీఎన్ ప్రతినిధి** : అమెరికాలో ఒక లెక్చర్ సందర్శన సందర్భంగా, హ్యూస్టన్ విశ్వవిద్యాలయంలో నా స్నేహితుడు మరియు సహోద్యోగి సియమియన్ ఫజ్‌టల్‌విచ్‌తో ఒకరితో ఒకరు ఆసక్తికరమైన ట్యుటోరియల్ జరిగింది. సియమియన్ నన్ను తాను అభివృద్ధి చేసిన గ్రాఫిటీ అనే అద్భుతమైన సాఫ్ట్‌వేర్‌ను పరిచయం చేశాడు. ఈ ప్రోగ్రామ్ గ్రాఫ్ సిద్ధాంతంలో——నోడ్స్ మరియు ఎడ్జెస్ యొక్క నెట్‌వర్క్‌లను అధ్యయనం చేసే గణిత శాఖలో——కొత్త మరియు సాధారణం కాని ఊహాగానాలను ఉత్పత్తి చేయగల సామర్థ్యం కలిగి ఉంది. నాకు, గ్రాఫిటీ 1980లు మరియు 1990లలో గణితం మరియు కంప్యూటర్ సైన్స్ రంగాలలో కృత్రిమ మేధస్సు (AI) యొక్క తొలి రూపాలలో ఒకటిగా కనిపించింది.

**గ్రాఫిటీ యొక్క AI సామర్థ్యాలు**

గ్రాఫిటీ యొక్క స్వయంచాలక రీజనింగ్ మరియు సృజనాత్మక సమస్యా పరిష్కార సామర్థ్యాలు AI యొక్క పలు లక్షణాలను ప్రదర్శించాయి. 1992 నాటికి, సియమియన్ గ్రాఫిటీని రసాయన శాస్త్రానికి కూడా విస్తరించాడు, ఇది అంతర్జాతీయ గుర్తింపు పొందింది. న్యూయార్క్ టైమ్స్ ఈ సాఫ్ట్‌వేర్ ప్రభావాన్ని హైలైట్ చేస్తూ ఒక కథనాన్ని ప్రచురించింది. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ గ్రాఫ్ సిద్ధాంతకారులు గ్రాఫిటీ ద్వారా ఉత్పత్తి చేయబడిన ఊహాగానాల రుజువులను ప్రచురించడం ప్రారంభించారు. ప్రసిద్ధ గణిత శాస్త్రజ్ఞుడు పాల్ ఎర్డోస్ కూడా ఈ ఊహాగానాలపై పనిచేశాడు, ఈ సాఫ్ట్‌వేర్ యొక్క ప్రాముఖ్యతను రేఖాంకితం చేశాడు.

AI విప్లవానికి గ్రాఫిటీ యొక్క సహకారం

ఈ రోజు మనం చూస్తున్న AI విప్లవం, గ్రాఫిటీ వంటి తొలి వేదికలకు చాలా రుణపడి ఉంది, ఇవి డేటా సైన్స్, న్యూరల్ నెట్‌వర్క్‌లు, మరియు మెషిన్ లెర్నింగ్‌లలో తర్వాతి అభివృద్ధులకు బీజాలు నాటాయి. భారతదేశం ఒకప్పుడు సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో వాగ్దానాన్ని చూపించినప్పటికీ, ప్రేరణ లేని పాఠ్యప్రణాళికలు మరియు బౌద్ధిక ధైర్యం లేకపోవడం వల్ల AI విస్ఫోరణంలో పెద్దగా వెనుకబడిపోయింది. దశాబ్దాలుగా ఈ నిర్లక్ష్యం భారతదేశానికి భారీ ధరను చెల్లించవచ్చు.

**AI యొక్క ప్రస్తుత పురోగతి**

ప్రస్తుత AI విస్ఫోరణం ఒకవైపు ఉత్తేజకరంగా, మరోవైపు భయానకంగా ఉంది. మే మధ్యలో, యూకే మరియు యూఎస్ నుండి నిపుణులతో సహా సుమారు 30 ప్రముఖ గణిత శాస్త్రజ్ఞులు కాలిఫోర్నియాలోని బర్కిలీలో రహస్యంగా సమావేశమై, అత్యాధునిక రీజనింగ్ చాట్‌బాట్‌ను పరీక్షించారు. వర్జీనియా విశ్వవిద్యాలయం నుండి కెన్ ఒనో నాయకత్వంలో, ఈ గణిత శాస్త్రజ్ఞులు రెండు రోజుల పాటు AIకి ప్రొఫెసర్‌స్థాయి సవాలు సమస్యలను ఉంచారు. ఆశ్చర్యకరంగా, చాట్‌బాట్ ప్రతి సమస్యను పరిష్కరించింది, ఒక కష్టమైన PhDస్థాయి ప్రశ్నను కేవలం పది నిమిషాల్లో పరిష్కరించింది——ఇది అత్యంత ప్రతిభావంతమైన మానవ మేధావులను కూడా ఆకట్టుకునే సామర్థ్యం.

**AI యొక్క సవాళ్లు**

OpenAI యొక్క o4మినీ మోడల్‌పై ఆధారపడిన ఈ AI, అనేక మానవ నిపుణులను అధిగమించే అధునాతన రీజనింగ్ సామర్థ్యాన్ని ప్రదర్శించింది. అయితే, ఒక ప్రమాదం ఉంది: దాని ఆత్మవిశ్వాసం మరియు అధికారిక స్పందనలు కొందరిని భయపెట్టవచ్చు, దాని పరిష్కారాలను పరిశీలన లేకుండా అంగీకరించేలా చేయవచ్చు. ఒనో హాస్యంగా చెప్పినట్లు, చాట్‌బాట్ "భయపెట్టడం ద్వారా రుజువు" చేయడంలో నైపుణ్యం సాధించింది.

భారత్‌కు ఒక పిలుపు

గణిత శాస్త్రజ్ఞులకు మరియు సమాజానికి, ఈ క్షణం ఉత్తేజకరమైనది మరియు అస్థిరమైనది. ఒకప్పుడు అభివృద్ధి చేయడానికి మరియు సాధన చేయడానికి దశాబ్దాలు పట్టిన సాధనాలు ఇప్పుడు క్షణాల్లో సంక్లిష్ట సమస్యలను పరిష్కరిస్తున్నాయి. తన గొప్ప బౌద్ధిక సంప్రదాయంతో, భారతదేశం ఈ సవాలును స్వీకరించాలి మరియు AIని కేవలం సాధనంగా కాక, ఆవిష్కరణలో భాగస్వామిగా స్వీకరించాలి, లేకపోతే ఈ రూపాంతర యుగంలో మరింత వెనుకబడిపోయే ప్రమాదం ఉంది.







# సవాళ్లకు దీటుగా యంగ్ టీమిండియా..!

**టీపీఎన్ ప్రతినిధి | బర్మింగ్‌హామ్**

ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్ సాధించిన ఉత్తేజకర విజయం తర్వాత ఒక చర్చ రగిలింది: కొత్త టీమ్ ఇండియా చివరకు తన శిఖరాన్ని చేరుకుంటోందా? ఈ యువ జట్టు చుట్టూ ఉన్న కథనం తీవ్రంగా మారింది——లీడ్స్‌లో ఓటమి తర్వాత తీవ్ర విమర్శలు, ఆపై బర్మింగ్‌హామ్‌లో చారిత్రక విజయం తర్వాత ఉత్సాహపూరిత ప్రశంసలు. అయితే, తీవ్ర భావోద్వేగాలలో కొట్టుకుపోకుండా, వాస్తవాలను జాగ్రత్తగా పరిశీలించే సమయం ఇది.

**లీడ్స్ ఓటమి మరియు ఎడ్జ్‌బాస్టన్ పునరాగమనం**

లీడ్స్ టెస్ట్ ఓటమి శుభమన్ గిల్ మరియు జట్టుపై అభిమానులు మరియు విమర్శకులలో నిరాశను కలిగించింది. అయితే, క్రికెట్ అనేది గెలుపోటములతో నిండిన క్రీడ. ముఖ్యంగా, రెండవ టెస్ట్‌లో భారత్ యొక్క ప్రతిస్పందన స్థిరత్వం, నేర్చుకోవడం, మరియు అనుసరణను చూపించింది. సాపేక్షంగా కొత్త కెప్టెన్ నాయకత్వంలోని ఈ యువ జట్టు గొప్ప సామర్థ్యాన్ని కలిగి ఉంది. రవీంద్ర జడేజా తప్ప, ప్రస్తుత లైనప్‌లోని ప్రతి ఆటగాడు 34 ఏళ్ల కంటే తక్కువ వయస్సు కలిగినవాడు, ఇది రాబోయే సంవత్సరాల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించే జట్టును సూచిస్తుంది.ఇంగ్లండ్‌లో టెస్ట్ సిరీస్ గెలవడం: ఒక సవాలు

ఉపఖండ జట్లకు ఇంగ్లండ్‌లో టెస్ట్ సిరీస్ గెలవడం అత్యంత కష్టమైన సవాలు. భారత్ చివరిసారిగా 2007లో రాహుల్ ద్రవిడ్ నాయకత్వంలో ఇంగ్లండ్‌లో సిరీస్ గెలిచింది. ఎంఎస్ ధోని మరియు విరాట్ కోహ్లీ వంటి దిగ్గజాలు కూడా అక్కడ సిరీస్ విజయాన్ని సాధించలేకపోయారు. ఈ సందర్భంలో, రెండవ టెస్ట్ విజయం మరింత ఆకట్టుకుంది——భారత్ అరుదైన అవే విజయాన్ని సాధించడమే కాక, ఇంగ్లండ్‌ను 336 పరుగుల తేడాతో ఘోరంగా ఓడించింది, ఇది రన్స్ పరంగా వారి అతిపెద్ద అవే విజయం.

రికార్డు సృష్టించిన బ్యాటింగ్ మరియు బౌలింగ్

ఈ మ్యాచ్‌లో భారత్ అద్భుతంగా 1014 పరుగులు సాధించింది, ఇది ఒక టెస్ట్ మ్యాచ్‌లో భారత జట్టు 1000 రన్స్ మార్కును దాటిన మొదటి సందర్భం. శుభమన్ గిల్ చరిత్ర సృష్టించాడు, ఒకే మ్యాచ్‌లో డబుల్ సెంచరీ మరియు సెంచరీ సాధించిన తొలి టెస్ట్ ఆటగాడిగా నిలిచాడు. రిషభ్ పంత్ మరియు రవీంద్ర జడేజా కూడా కీలక సమయాల్లో ఫామ్‌లోకి వచ్చారు.

ఇంగ్లండ్ బౌలింగ్ దాడి, జోఫ్రా ఆర్చర్, ఒల్లీ స్టోన్, మరియు మార్క్ వుడ్ వంటి కీలక బౌలర్లు లేకపోవడంతో సతమతమైంది. భారత బౌలర్లు, స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా లేనప్పటికీ, అద్భుతంగా రాణించారు. ఆకాశ్ దీప్ మరియు మహ్మద్ సిరాజ్ ఇంగ్లండ్ బ్యాటింగ్ లైనప్‌ను ధ్వంసం చేశారు. ఆకాశ్ దీప్ రెండు ఇన్నింగ్స్‌లలో 10 వికెట్లు తీసి, ఇంగ్లండ్‌లో భారత బౌలర్‌కు ఉత్తమ బౌలింగ్ గణాంకాలను నమోదు చేశాడు. ఫ్లాట్ పిచ్‌పై వారి క్రమశిక్షణతో కూడిన, అవిశ్రాంత బౌలింగ్ ఒక మాస్టర్‌క్లాస్‌గా నిలిచింది.

రాబోయే సవాళ్లుఇంగ్లండ్ దెబ్బతిన్నప్పటికీ, వారు తిరిగి బలంగా వస్తారని భావిస్తున్నారు. మూడవ టెస్ట్‌కు ఆర్చర్ తిరిగి రావచ్చు మరియు ఇతర బౌలర్లు ఫిట్‌నెస్ సాధించవచ్చు, ఇది ఆతిథ్య జట్టుకు బలాన్ని ఇస్తుంది. ఫ్లాట్ పిచ్‌లు మరియు కీలక ఆటగాళ్ల అనుపస్థితి ఇంగ్లండ్ యొక్క లోతును పరీక్షించాయి. అయినప్పటికీ, మూడు టెస్ట్‌లు మిగిలి ఉండటంతో, సిరీస్ ఫలితం ఇంకా నిర్ణయం కాలేదు. భారత్‌కు ఆత్మవిశ్వాసం ఉవ్వెత్తున ఉంది, చారిత్రక విజయం మరియు పూర్తిగా ఫిట్‌గా ఉన్న బుమ్రా తిరిగి వస్తే సిరీస్‌ను మరింత అనుకూలంగా మార్చవచ్చు.

**యువ జట్టు యొక్క బలం**

ఈ యువ భారత జట్టు ధైర్యం, ప్రతిభ, మరియు ఓటముల నుండి నేర్చుకునే సామర్థ్యాన్ని చూపించింది. ఎడ్జ్‌బాస్టన్ విజయం కేవలం స్కోర్‌బోర్డ్‌పై విజయం మాత్రమే కాదు; ఇది ఒక మానసిక బ్రేక్‌త్రూ, ఇంగ్లండ్ యొక్క దీర్ఘకాల ఆధిపత్యాన్ని భేదించింది. ఈ ఫామ్‌ను కొనసాగించి సిరీస్ విజయాన్ని సాధించగలరా అనేది చూడాల్సి ఉంది. కానీ ఒక విషయం స్పష్టం——ఈ టీమ్ ఇండియా తన లయను కనుగొంటోంది, ప్రపంచంలోని ఉత్తమ జట్లను వారి సొంత మైదానంలో సవాలు చేయడానికి సిద్ధంగా ఉంది.

# మెగా PTM 2.0 సరికొత్త అధ్యాయానికి నాంది..!

ఈ రోజు ప్రపంచంలో, వ్యక్తులు తమ "జీవన ప్రయాణాన్ని రూపొందించుకోవాలి" అనే ఆలోచనను ప్రోత్సహిస్తున్నారు, మరియు ఈ విజయానికి సూక్ష్మమైన ప్రణాళిక కీలకం. గత కొన్ని దశాబ్దాలుగా, "విద్యార్థి జీవితాన్ని రూపొందించడం" అనే భావన గణనీయమైన ఆదరణ పొందింది. అనేక ప్రైవేట్ విద్యా సంస్థలు, వ్యక్తిగతీకరించిన మార్గమే పిల్లల వ్యక్తిగత వృద్ధికి ఏకైక మార్గమని ఒప్పించే ప్రయత్నంలో ఉన్నాయి.

అయితే, వాస్తవం భిన్నంగా ఉంది. మధ్య మరియు తక్కువ ఆదాయ కుటుంబాల తల్లిదండ్రులు ఈ కథనానికి ఆకర్షితులై, దురదృష్టవశాత్తూ, ఇది ప్రభుత్వ విద్యా వ్యవస్థను నాశనం చేసింది. అయినప్పటికీ, ఉచిత ఆరోగ్యం మరియు విద్య అనేవి మంచి పాలన యొక్క ప్రాథమిక నిబద్ధతలుగా మిగిలాయి.

బాహ్య దృక్కోణం నుండి చూస్తే, ఆంధ్రప్రదేశ్‌లో గణనీయమైన సంఖ్యలో యువత ప్రతిష్టాత్మక IITలు మరియు ఇతర జాతీయ సంస్థలలో స్థానం సంపాదించారు. అయినప్పటికీ, ఈ సంస్థలను చేరాలని కలలు కనే విద్యార్థులలో వాస్తవంగా లక్ష్యాన్ని సాధించే వారి శాతం 3% కంటే తక్కువగా ఉంది, ఎందుకంటే చాలా మంది కోచింగ్ సంస్థల్లో చేరుతారు. ఇది తల్లిదండ్రులకు ఆర్థిక భారాన్ని మరియు యువతకు నిరాశను తెచ్చిపెడుతుంది, ఫలితంగా వారు రాష్ట్రంలోని ప్రైవేట్ వృత్తిపరమైన సంస్థల వైపు మొగ్గు చూపుతారు. ఈ మార్గాన్ని ఎంచుకున్న వారు తరచుగా తక్కువ జీతం గల ఉద్యోగాలతో జీవనం సాగించడానికి అవిశ్రాంత పోరాటం చేయాల్సి వస్తుంది.

**మెగా PTM 2.0: ప్రభుత్వ విద్యను పునరుజ్జీవనం చేయడం**

ఈ రోజు జరుగుతున్న మెగా పేరెంట్‌టీచర్ మీటింగ్ (PTM) ప్రభుత్వ విద్యను పునరుజ్జీవనం చేయడానికి మరియు ప్రజల విశ్వాసాన్ని పునర్నిర్మించడానికి ఒక ఉద్దేశపూర్వక మరియు కీలకమైన చర్య. రెండు మెగా PTMలు మరియు రెండు త్రైమాసిక పేరెంట్‌టీచర్ సమావేశాల షెడ్యూల్, రాష్ట్ర భవిష్యత్ కార్యక్రమాలకు సంతోషకరమైన, విజయవంతమైన, మరియు సామర్థ్యవంతమైన మానవశక్తిని తీర్చిదిద్దేందుకు ఒక బాగా రూపొందిన వ్యూహాన్ని సూచిస్తుంది. ఇటువంటి చురుకైన చర్యలు లేకపోతే, మహారాష్ట్ర మరియు కర్ణాటక వంటి రాష్ట్రాలు ఎదుర్కొన్న సవాళ్లను ఆంధ్రప్రదేశ్ కూడా ఎదుర్కోవచ్చు, ఇక్కడ ఆర్థిక వృద్ధి మరియు సంపద దిగుమతి చేసుకున్న నైపుణ్య కార్మికులపై మరియు స్థానికుల నుండి తిరుగుబాట్లపై ఆధారపడుతున్నాయి.

**తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల సహకారం**

ఈ ప్రయత్నంలో, సమాచారం కలిగిన తల్లిదండ్రి ప్రధాన పాత్ర పోషిస్తారు, మరియు తల్లిదండ్రులుఉపాధ్యాయుల సంయుక్త ప్రయత్నం పిల్లల భవిష్యత్తును వారి సహజ బలాలను ఉపయోగించుకుని, బలహీనతలను సవరించే విధంగా రూపొందించడంలో కీలకం. ఈ సహకారం సాంప్రదాయ విద్యను అధిగమిస్తూ, వ్యక్తిగత అభివృద్ధి ప్రయాణాన్ని ప్రోత్సహిస్తుంది, ఇది అభివృద్ధి చెందిన దేశానికి అవసరమైన మానవ వనరులను నిర్మించడానికి ఆధారం.

ప్రభుత్వ విద్యలో పునరుజ్జీవనం

మన ప్రభుత్వ విద్యా వ్యవస్థ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యొక్క విఘాతకర శక్తి మరియు జనరేషన్ Z యొక్క సూక్ష్మ ప్రాధాన్యతలతో గుర్తించబడిన గ్లోబల్ యుగంలో ఎప్పుడో ఆలస్యమైన పునరుజ్జీవనాన్ని గుర్తించింది. ప్రతి విద్యార్థి యొక్క పురోగతిని సంపూర్ణంగా సమీక్షించడం ద్వారా, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు సహకరించి విద్యార్థి యొక్క అభ్యాస శైలి, బలాలు, మరియు బలహీనతలను సమగ్రంగా అర్థం చేసుకోవచ్చు. ఈ సహకార దృష్టి విజయాన్ని నిర్ధారిస్తుంది మరియు సరైన కెరీర్ ఎంపికలను సమాచారం చేస్తుంది, ఇంటిలో మరియు పాఠశాలలో వ్యక్తిగతీకరించిన మద్దతును అందిస్తుంది. ఈ సమన్వయం విద్యా పనితీరును మెరుగుపరుస్తుంది, ఉన్నత గ్రేడ్‌లను సాధిస్తుంది, మరియు జీవితకాల అభ్యాస ప్రేమను నాటుతుంది.

**హోలిస్టిక్ ప్రోగ్రెసివ్ కార్డ్**

ఈ రోజు సమావేశం యొక్క ప్రధాన లక్షణాలలో ఒకటి, రాష్ట్ర విద్యా శాఖ రూపొందించిన విద్యార్థి యొక్క హోలిస్టిక్ ప్రోగ్రెసివ్ కార్డ్ సమీక్ష. ఇది కేవలం విద్యా సమీక్షతో పాటు, విద్యార్థి యొక్క అకడమిక్ కాని, పాఠ్యేతర, మానసిక, మరియు శారీరక ఆరోగ్యాలను సమగ్రంగా అందిస్తుంది, ఇది విద్యార్థిని నిర్వచించడానికి మరియు భవిష్యత్తును రూపొందించడానికి ఒక ముఖ్యమైన మైలురాయి.

మానసిక శ్రేయస్సు మరియు కెరీర్ ఎంపికలు

ఈ సంవత్సరం, సమగ్ర శిక్షా ఆంధ్రప్రదేశ్ యొక్క చురుకైన విద్యా నిర్వహణ బృందం కింద నియమించబడిన ఇన్‌హౌస్ శిక్షణ పొందిన మనస్తత్వవేత్తలు మరియు కెరీర్ నిపుణుల ద్వారా రాష్ట్రం మానసిక శ్రేయస్సు మరియు సమాచార కెరీర్ ఎంపికలను ప్రాధాన్యత ఇస్తోంది. ఈ రోజుల్లో చిన్న, న్యూక్లియర్ కుటుంబాలలో, ఇంటి మరియు పాఠశాల మధ్య స్థిరమైన సందేశాలు మరియు వ్యూహాలు చాలా ముఖ్యం. ఇవి పిల్లలకు సానుభూతి, స్థిరత్వం, ఆత్మవిశ్వాసం, సాంస్కృతిక విలువలు, మరియు సమర్థవంతమైన సంభాషణ వంటి కీలకమైన సామాజికమానసిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో సహాయపడతాయి. ఈ సమన్వయ విధానం కుటుంబాలు మరియు పాఠశాలలకు సమాచార నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని ఇస్తుంది, పిల్లలు సవాళ్లను ఎదుర్కోవడానికి, ఆరోగ్యకరమైన సంబంధాలను ఏర్పరచడానికి, మరియు వైవిధ్యమైన సామాజిక సెట్టింగులలో వృద్ధి చెందడానికి సన్నద్ధం చేస్తుంది.

పేరెంట్‌టీచర్ సమావేశాల లక్ష్యాలు

పేరెంట్‌టీచర్ సమావేశాల యొక్క ప్రధాన ఫలితాలను స్థిరత్వం, వనరుల విస్తరణ, మరియు సానుకూల పాఠశాల సంస్కృతిగా నిర్వచించవచ్చు.

LEAP: విద్యా శ్రేష్ఠతను నడిపించే సాధనం

ఈ అన్ని ప్రయత్నాలు LEAP (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) అనే బలమైన అప్లికేషన్ ద్వారా ఖచ్చితంగా పర్యవేక్షించబడుతున్నాయి, ఇది పాఠశాల నిర్వహణ మరియు ప్రణాళిక కోసం రూపొందించబడింది. అన్ని పురోగామి దేశాలు నాణ్యమైన డేటాపై ఆధారపడినట్లే, LEAP ఆంధ్రప్రదేశ్ అంతటా విద్యా శ్రేష్ఠతను నడిపించి, బలమైన మరియు ఆర్థికంగా స్థిరమైన భవిష్యత్తును నిర్ధారిస్తుంది. గుర్తుంచుకోండి, విద్య అందరికీ, మరియు ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం ఈ హక్కులను నిర్ధారిస్తుంది.

**గమనిక: ఈ కథనం రచయిత యొక్క దృక్కోణం మాత్రమే.**



**రామ్ కమల్,**
**సోషల్ ఇంజినీర్, సమగ్ర విద్య సలహాదారు,ఏపీ**

# మాటల్లో చెప్పలేని హింస : శశిథరూర్



టీపీఎన్, న్యూఢిల్లీ : దేశ చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగిలిన ఎమర్జెన్సీపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో దివంగత ప్రధాని ఇందిరా గాంధీ కుమారుడు సంజయ్ గాంధీ వ్యవహరించిన తీరు అత్యంత క్రూరంగా ఉందని, ఆయన చర్యలు మాటల్లో చెప్పలేని హింసకు దారితీశాయని తీవ్రంగా విమర్శించారు. ఎమర్జెన్సీని కేవలం ఒక మరపురాని ఘట్టంగా కాకుండా, ఓ గుణపాఠంగా చూడాలని ఆయన అభిప్రాయపడ్డారు.

దేశంలో అత్యవసర పరిస్థితి విధించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో థరూర్ ఈ విషయాలను ప్రస్తావించారు. 197577 మధ్యకాలంలో సంజయ్ గాంధీ గ్రామీణ ప్రాంతాల్లో బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి హింసను మార్గంగా ఎంచుకున్నారు. అదుపులేని అధికారం నిరంకుశత్వానికి ఎలా దారితీస్తుందో ఆనాటి ఘటనలు నిరూపించాయి. ఆ చర్యలను తర్వాత 'దురదృష్టకరం' అని అభివర్ణించినా, ఆ గాయాలను ఎవరూ మర్చిపోలేరు అన్నారు.

ఎమర్జెన్సీ సమయంలో ఢిల్లీ లాంటి నగరాల్లో మురికివాడలను కనికరం లేకుండా కూల్చివేశారని, వేలాది మందిని నిరాశ్రయులను చేశారని గుర్తుచేశారు. పౌరుల ప్రాథమిక హక్కులను అణచివేసి, భావ ప్రకటనా స్వేచ్ఛను పూర్తిగా హరించడం భారత రాజకీయాల్లో ఒక మాయని మచ్చగా మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ చీకటి రోజుల నుంచి పాఠాలు నేర్చుకుని, భవిష్యత్తులో ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.



# సీఎం కుర్చీ ఖాళీ కాలేదు

## నేనే 5 ఏళ్లు సీఎం:సిద్ధరామయ్య

**టీపీఎన్, బెంగళూరు :**

కర్నాటక రాజకీయాలు రోజుకో కొత్త మలుపు తిరుగుతున్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఇద్దరూ ప్రభుత్వంలోని అగ్రనేతలు ఢిల్లీలో మకాం వేశారు. డిప్యూటీ సీఎం శివకుమార్ కర్ణాటక భవన్‌లో కొత్తగా నిర్మించిన సీఎం సూట్ లో బస చేయగా, సిద్ధరామయ్య పాత సూట్ లో బస చేస్తున్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని విడివిడిగా కలవడానికి ఇద్దరు నాయకులు సమయం కోరారు. ఈ నేపథ్యంలో, కర్ణాటకలో నాయకత్వ మార్పు గురించి ఊహాగానాలు జోరందుకున్నాయి.ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తాను ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉంటానని సిద్ధరామయ్య స్పష్టంగా చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు నాయకత్వం వహిస్తానని తెలిపారు. ఓబీసీ కౌన్సిల్‌లో తనకు స్థానం కల్పించడం ద్వారా ఢిల్లీ నుంచి పిలుపువచ్చిందనే ఊహాగానాలను కూడా ఆయన తోసిపుచ్చారు. నేను ఎక్కడికీ వెళ్లను, కర్ణాటకలోనే ఉంటాను, ఈ కుర్చీలోనే ఉంటానని అన్నారు. ప్రస్తుతం సీఎం కుర్చీ ఖాళీగా లేదని స్పష్టం చేశారు. డీకే శివకుమార్‌కు మద్దతు ఇచ్చే కొంతమంది ఎమ్మెల్యేలు ఉన్నారని ఆయన అంగీకరించారు. అటు ప్రతిపక్ష బీజేపీ కాంగ్రెస్‌పై అవినీతి ఆరోపణలు చేస్తోంది. రెండున్నరేళ్ల తర్వాత ముఖ్యమంత్రి మార్పు ఉంటుందనే అంశంపై అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, తమకు ఎటువంటి సూచనలు ఇవ్వలేదని అన్నారు. అదే సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కూడా ఆయన స్పందించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పటిష్టంగానే ఉందని, నిధుల కొరత లేదని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను, ముఖ్యంగా ఈడీని కాంగ్రెస్ నాయకులను లక్ష్యంగా చేసుకుని దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు

# బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎంపికపై కసరత్తు

## ఈసారి రేసులో ముగ్గురు మహిళలు

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

బీజేపీ చారిత్రాత్మక మార్పు వైపు పయనిస్తుందని ఉన్నత స్థాయి వర్గాలు సూచించాయి. కాషాయ పార్టీ మొదటిసారిగా మహిళా జాతీయ అధ్యక్షురాలిని నియమించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కొంతకాలంగా పార్టీ అగ్ర నాయకత్వంలో చర్చలు జరుగుతున్నాయి, ఇందులో అనేక మంది ప్రముఖ మహిళా నాయకుల పేర్లు పరిశీలిస్తున్నారు. బిజెపి తదుపరి జాతీయ అధ్యక్షురాలు ఎవరు? దీనిపై ప్రస్తుతానికి సస్పెన్స్ కొనసాగుతోంది. కొంతకాలంగా పార్టీ అగ్ర నాయకత్వంలో చర్చలు జరుగుతున్నాయి. ఇందులో చాలా మంది ప్రముఖ మహిళా నాయకుల పేర్లు పరిగణించబడుతున్నాయి. సంస్థాగత సమతుల్యత, మహిళా సాధికారత , రాబోయే ఎన్నికల వ్యూహాల పరంగా నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం.ఈ రేసులో దేశ ప్రస్తుత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ముందంజలో ఉన్నారని భావిస్తున్నారు. నిర్మలా సీతారామన్ ఇటీవల పార్టీ ప్రధాన కార్యాలయంలో బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా , ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్‌లను కలిశారు. ఆమె నియామకం, పార్టీకి అనేక వ్యూహాత్మక లక్ష్యాలను సాధించడంలో సహాయ పడుతుందని అంతర్గత వర్గాలు భావిస్తున్నాయి. ఈ పదవికి నిర్మలా సీతారామన్ ఎంపికైతే, ఆమె పదోన్నతి దక్షిణ భారతదేశంలో బిజెపి తన పట్టును బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. దీంతో పాటు మహిళలకు సాధికారత కల్పించాలనే మోడీ ప్రభుత్వ సంకల్పం కూడా ఫలిస్తుంది. ప్రస్తుతం ఆర్థిక మంత్రిగా పనిచేస్తున్న నిర్మలా సీతారామన్ గతంలో రక్షణ శాఖను నిర్వహించారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో సుదీర్ఘ అనుభవాన్ని కలిగి ఉన్నారు.



**పురందేశ్వరి**

ఇక దగ్గుబాటి పురందేశ్వరి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక ముఖ్యమైన స్థానాన్ని కలిగి ఉన్నారు. పురందేశ్వరి ఏపీ నుంచి ఎంపీగా కొనసాగుతున్నారు. రాష్ట్రంలో బిజెపి అధ్యక్షురాలిగా కూడా పనిచేశారు. సుష్మా స్వరాజ్ లాగా పురందేశ్వరిని ఆకట్టుకునే వక్తగా భావిస్తారు. ఆమె రెండు ప్రధాన జాతీయ పార్టీలలో విజయవంతమైన కెరీర్‌ను కలిగి ఉంది. ఆమె బహుభాషావేత్త .తెలుగు, తమిళం, హిందీ, ఇంగ్లీష్, ఫ్రెంచ్ భాషలలో బాగా ప్రావీణ్యం కలవారు.ఆమె 2023 జులైలో ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఇటీవలి వరకు ఈ పదవిలో ఉన్నారు. ఆమె దక్షిణ భారతదేశంలో పార్టీకి పెద్ద ప్రతినిధిగా మారగలదు.

**వానతి శ్రీనివాసన్**

వానతి శ్రీనివాసన్ న్యాయవాది. రాజకీయాల్లో చురుకుగా పనిచేస్తారనే పేరుంది.. ప్రస్తుతం తమిళనాడు శాసనసభలో కోయంబత్తూర్ సౌత్ నుండి బిజెపి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆమె రాజకీయ ప్రయాణం 1993 లో భారతీయ జనతా పార్టీలో చేరడంతో ప్రారంభమైంది. అప్పటి నుండి ఆమె పార్టీ సంస్థలో క్రమంగా అంచెలంచెలుగా ఎదిగారు. వానతి తమిళనాడు బిజెపిలో రాష్ట్ర కార్యదర్శి (201314), ప్రధాన కార్యదర్శి (201420) రాష్ట్ర ఉపాధ్యక్షుడు (2020) వంటి ముఖ్యమైన పాత్రలను నిర్వహించారు. 2020 అక్టోబర్‌లో బిజెపి మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలిగా వానతి నియమితులయ్యారు. పార్టీ మహిళల్లో తన స్థానాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారించిన సమయంలో ఆమె ఈ బాధ్యతను స్వీకరించారు. 2022లో, ఆమెను బిజెపి కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యురాలిగా నియమించారు. ఈ ప్రతిష్టాత్మక కమిటీలో చేర్చబడిన మొదటి తమిళ మహిళ ఆమె. వానతి శ్రీనివాసన్ న్యాయ నిపుణురాలు మాత్రమే కాదు.. అట్టడుగు రాజకీయాలలో కూడా నిష్ణాతురాలు. మహిళా సాధికారత, సంస్థాగత బలం, శాసనసభలో చురుకైన పాత్ర ద్వారా ఆమె రాష్ట్రంలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా తనదైన ముద్ర వేశారు.

**ఆర్‌ఎస్‌ఎస్ కూడా సిద్ధంగా ఉందా?**

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) కూడా మహిళా నాయకత్వం పట్ల సానుకూల వైఖరిని అవలంబించింది. మహిళా నాయకత్వం ప్రతీకాత్మకంగా , వ్యూహాత్మకంగా పెద్ద ప్రభావాన్ని చూపుతుందని వారు విశ్వసిస్తున్నారు. ఇటీవలి కాలంలో బిజెపికి మహిళా ఓటర్ల నుండి భారీ మద్దతు లభించింది. ముఖ్యంగా మహారాష్ట్ర, హర్యానా , ఢిల్లీ వంటి రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో. పార్టీ మహిళా కేంద్రీకృత పథకాలు , లబ్ధిదారుల ఓటు బ్యాంకు వ్యూహాన్ని మరింత బలోపేతం చేస్తాయి.

# బీహార్ ఓటర్ల జాబితా సవరణకు సుప్రీం గ్రీన్ సిగ్నల్

**టీపీఎన్, పాట్నా :**

బీహార్‌లో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియకు సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఓటర్ల జాబితా సవరణపై స్టే విధించేందుకు దేశ అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. రాజ్యాంగం ప్రకారం ఈసీకి ఈ ప్రక్రియను నిర్వహించే అధికారం ఉందన్న సుప్రీంకోర్టు.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ కొనసాగించవచ్చని ఈసీకి సూచించింది. ఇదే సమయంలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు నెలల ముందు 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' నిర్వహించాలనే ఈసీ నిర్ణయంపై సుప్రీంకోర్టు తీవ్రమైన సందేహాలను వ్యక్తం చేసింది. బీహార్ ఓటర్ల జాబితా సవరణను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలు అయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సుధాన్షు ధులియా ధర్మాసనం విచారణ చేపట్టింది. బీహార్‌లో ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై స్టే విధించేందుకు ధర్మాసనం నిరాకరించింది.




అఫిడవిట్ దాఖలు చేయడానికి ఎన్నికల కమిషన్‌కు ఇంకా సమయం ఉందని పేర్కొన్న ధర్మాసనం.. కేసు తదుపరి విచారణను 2025 జులై 28కి వాయిదా వేసింది. విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఈసీకి కీలక ఆదేశాలు జారీ చేసింది. ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డులను చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాలుగా పరిగణించాలని ఈసీని ఆదేశించింది.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ నిర్వహించడం సమస్య కాదు.. కానీ బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఈ వ్యాయామాన్ని నిర్వహించగలరా అని మాకు తీవ్రమైన సందేహాలు ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. దాదాపు 8 కోట్ల మంది జనాభా ఈ ఇంటెన్సివ్ సమీక్షకు లోబడి ఉండటంతో దీనిని రాబోయే ఎన్నికలతో అనుసంధానించడం సాధ్యమేనా అని ఈసీని ప్రశ్నించింది ధర్మాసనం. బీహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను నవంబర్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ఎందుకు అనుసంధానించాలి..? ఎన్నికలతో సంబంధం లేకుండా ఎస్ఐఆర్ తర్వాత ఎందుకు చేయకూడదని ప్రశ్నించింది. అనంతరం పిటిషన్ పై విచారణను జూలై 28కి వాయిదా వేసింది ధర్మాసనం. అప్పటి వరకు ఓటర్ల సవరణ జాబితా ముసాయిదాను ప్రచురించవద్దని ఈసీని ఆదేశించింది.

# బీహార్‌లో మహిళలు నిజంగా సాధికారత పొందుతున్నారా?

**టీపీఎన్, పాట్నా :**

బీహార్‌లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, రాష్ట్ర ప్రభుత్వం మహిళలపై దృష్టి పెట్టింది. మహిళల ఓటు ఇప్పుడు చాలా ముఖ్యమైనదిగా పరిగణించబడుతుంది. కారణం గత కొన్ని సంవత్సరాలుగా మహిళలు ప్రభావవంతమైన ఓటు బ్యాంకుగా మారారు. ఈ విషయంలో, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు ప్రకటించారు. నిజానికి గత దశాబ్ద కాలంగా బీహార్‌లో మహిళా ఓటర్ల సంఖ్య పురుషుల కంటే ఎక్కువ. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో మహిళల ఓటింగ్ శాతం 59.7 కాగా, పురుషుల ఓటింగ్ శాతం 54.6 మాత్రమే. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్న మూడవ ఎన్నిక ఇది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో దాదాపు 59.9 శాతం మహిళా ఓటర్లు పాల్గొనగా, పురుషుల శాతం 55.3. ఇటీవల 2024 లోక్‌సభ ఎన్నికల్లో కూడా మహిళలు పురుషుల కంటే ఎక్కువగా ఓటు వేశారు. మహిళల ఓటింగ్ శాతం 59.45 కాగా, పురుషుల ఓటింగ్ శాతం 53.

**బీహార్‌లో బాలికల సంఖ్య పెరుగుదల**

జనాభా స్థాయిలో, బీహార్ క్రమంగా మెరుగుపడింది. 2011 జనాభా లెక్కల ఆధారంగా NITI ఆయోగ్ మార్చి 2025 నివేదిక ప్రకారం రాష్ట్రంలో జనన సమయంలో లింగ నిష్పత్తి 1,000 మంది పురుషులకు 933 మంది మహిళలు. ఇది జాతీయ సగటు 914 కంటే ఎక్కువ.

**పనిలో మహిళల భాగస్వామ్యం**

మహిళలకు రిజర్వేషన్ ఇవ్వడం మంచి విషయమే, కానీ అసలు ప్రశ్న బీహార్‌లో ఎంత మంది మహిళలు పనిచేస్తున్నారు? పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం, 2017-18లో 15 ఏళ్లు పైబడిన మహిళల శ్రమ భాగస్వామ్య రేటు కేవలం 4.1 శాతం మాత్రమే ఉంది. ఇది దేశంలోనే అత్యల్పం. కానీ ఈ రేటు 2022-23లో 22.4 శాతానికి పెరిగింది. 2023-24లో ఇది 30.5 శాతానికి చేరుకుంది. అంటే ఆరు సంవత్సరాలలో ఏడు రెట్లు పెరుగుదల. 2017-18లో, బీహార్‌లో మహిళా కార్మికుల పంపిణీ దాదాపు మూడు భాగాలుగా ఉంది. స్వయం ఉపాధి, జీతాలు,సాధారణ శ్రమ. కానీ 2023-24లో పరిస్థితి మారిపోయింది. ఇప్పుడు 83 శాతం మంది మహిళలు స్వయం ఉపాధిలో నిమగ్నమై ఉన్నారు. 4.8 శాతం మంది మహిళలు మాత్రమే సాధారణ జీతాలు పొందే ఉద్యోగాలలో ఉన్నారు. 11.7 శాతం మంది మహిళలు రోజువారీ వేతన కార్మికులుగా పనిచేస్తున్నారు.

**మహిళలు తక్కువ సంపాదన**

శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పటికీ, వారి ఆదాయం ఇప్పటికీ పురుషుల కంటే చాలా తక్కువగా ఉంది. బీహార్ ఆర్థిక సర్వే 2023-24 ప్రకారం,గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి పొందుతున్న మహిళలు నెలకు సగటున రూ.4,434 సంపాదిస్తారు. పురుషులు రూ.10,000 కంటే ఎక్కువ సంపాదిస్తారు. పట్టణ స్వయం ఉపాధిలో ఈ అంతరం ఇంకా ఎక్కువగా ఉంది. మహిళలు రూ.8,342 సంపాదిస్తారు, పురుషులు రూ.18,583 సంపాదిస్తారు. ఈ వ్యత్యాసం రూ.10,000 కంటే ఎక్కువ. పట్టణ ప్రాంతాల్లో సాధారణ జీతం పొందే ఉద్యోగాలలో మహిళలు నెలకు రూ.22,394 సంపాదిస్తారు, పురుషుల సగటు ఆదాయం రూ. 23,869. ఈ వ్యత్యాసం సాపేక్షంగా తక్కువగా ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో జీతం పొందే ఉద్యోగాలలో, ఈ వ్యత్యాసం మళ్లీ పెరుగుతుంది. పురుషులు రూ.18,504 సంపాదిస్తున్నారు. మహిళలు రూ.14,848 సంపాదిస్తారు. అంటే ప్రతి నెలా రూ.3,656 తేడా ఉంది.





# నిమిషా ప్రియకు ఉరిశిక్ష ఆగేనా?

- **ఈ నెల 16న నిమిష ప్రియకు ఉరిశిక్ష**
- **ఆమెను కాపాడాలంటూ భారత సుప్రీంకోర్టులో పిటిషన్**

**టీపీఎన్, యెమెన్ :**

అరబ్ దేశం యెమెన్‌లో మాజీ వ్యాపార భాగస్వామిని హత్య చేసిన కేసులో ఉరిశిక్ష పడిన భారతీయ నర్సు నిమిషా ప్రియను కాపాడేందుకు ప్రయత్నాలు ఉపందుకున్నాయి. ఆమెకు ఈ నెల 16న ఉరిశిక్ష అమలు చేయాలని యెమెన్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఇప్పటికే జైలు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నిమిష ప్రియ ఉరిశిక్ష అమలుకు సమయం దగ్గరపడుతున్న వేళ, ఈ కేసును విచారించేందుకు భారత సర్వోన్నత న్యాయస్థానం ముందుకొచ్చింది. నిమిష ప్రియను కాపాడేందుకు దౌత్యపరమైన చర్యలు చేపట్టేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. ఈ పిటిషన్‌పై ఈ నెల 14న విచారణ జరపనున్నట్లు సుప్రీం కోర్టు ధర్మాసనం తెలిపింది. విచారణను త్వరగా చేపట్టాలని సీనియర్ న్యాయవాది రాజేంత్ బసంత్ కోర్టును అభ్యర్థించారు. షరియా చట్టం ప్రకారం, మృతుడి కుటుంబానికి నష్టపరిహారం (బ్లడ్ మనీ) చెల్లించడం ద్వారా క్షమాభిక్ష పొందే అవకాశం ఉందని ఆయన ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు సేవ్ నిమిషా ప్రియ కౌన్సిల్'పేరిట స్వచ్ఛంద, సామాజిక కార్యకర్తలు ఆమెను ఉరిశిక్ష నుంచి తప్పించడానికి ఉద్యమిస్తున్నారు. ప్రజల మద్దతు కూడగడుతున్నారు. హత్యకు గురైన మెహదీ కుటుంబం క్షమాభిక్ష ప్రసాదిస్తే శిక్ష నుంచి ఆమె బయటపడే అవకాశం ఉంది. బాధిత కుటుంబానికి బ్లడ్‌మనీ కింద చెల్లించడానికి నిమిషా ప్రియ బంధువులు, మిత్రులు, మద్దతుదారులు రూ.7,35,000 సేకరించారు. మెహదీ కుటుంబం స్పందన కోసం ఎదురు చూస్తున్నామని 'సేవ్ నిమిషా ప్రియ కౌన్సిల్'సభ్యుడు, సామాజిక కార్యకర్త బాబు జాన్ చెప్పారు. ఆమెను ఎలాగైనా రక్షించాలన్నదే ఆశ ఆశయమని అన్నారు. ఇప్పటికైనా క్షమాభిక్ష ప్రసాదించాలని, ఒక మహిళ ప్రాణాలు కాపాడాలని మెహదీ కుటుంబాన్ని కోరారు. నిమిషా ప్రియకు మద్దతు ప్రకటిస్తూ సోషల్ మీడియాలో చాలామంది పోస్టులు చేస్తున్నారు. ఉరిశిక్ష నుంచి బయటపడి ఆమె క్షేమంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నారు.బ కేరళలోని పాలక్కాడ్‌కు చెందిన నిమిష ప్రియ, నర్సుగా ఉద్యోగం కోసం 2008లో యెమెన్‌కు వెళ్లారు. అక్కడ సొంతంగా క్లినిక్ ప్రారంభించేందుకు యెమెన్ పౌరుడైన తలాల్ అదిబ్ మెహదీని వ్యాపార భాగస్వామిగా చేసుకున్నారు. అయితే, కొంతకాలానికే మెహదీ నుంచి ఆమెకు వేధింపులు మొదలయ్యాయి. ఈ క్రమంలో 2017లో, అతని నుంచి తన పాస్‌పోర్ట్‌ను తిరిగి పొందేందుకు నిమిష ప్రియ ప్రయత్నించారు. అందులో భాగంగా అతనికి మత్తుమందు ఇచ్చారు. అయితే, ఆ మందు మోతాదు ఎక్కువ కావడంతో మెహదీ మరణించాడు. ఈ హత్య కేసులో విచారణ జరిపిన యెమెన్ న్యాయస్థానం ఆమెకు మరణశిక్ష విధించింది. తన కుమార్తెను కాపాడుకునేందుకు నిమిష తల్లి ప్రేమకుమారి గత ఏడాది యెమెన్‌కు వెళ్లి మృతుడి కుటుంబంతో చర్చలు జరిపినా అవి ఫలించలేదు. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.



# తాలిబాన్ ప్రభుత్వానికి రష్యా మద్దతు

రష్యా ఒక చారిత్రాత్మక అడుగు వేసి ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించింది. ఇప్పటివరకు ఏ దేశం కూడా తాలిబన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించకపోవడంతో ఈ చర్య ప్రపంచ రాజకీయాల్లో ఒక మలుపుగా పరిగణించబడుతుంది. తాలిబన్లు నియమించిన కొత్త ఆఫ్ఘన్ రాయబారి గుల్ హసన్ హసన్‌ను అంగీకరిస్తూ రష్యా ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. దీంతో, తాలిబన్ పాలనను అధికారికంగా గుర్తించిన మొదటి దేశంగా రష్యా నిలిచింది. 2021 ఆగస్టులో ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్ అధికారంలోకి వచ్చింది.ఇస్లామిక్ ఎమిరేట్ ఆఫ్ ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వానికి అధికారిక గుర్తింపు లభించడం వల్ల రెండు దేశాల మధ్య వివిధ రంగాలలో నిర్మాణాత్మక ద్వైపాక్షిక సహకారం పెరుగుతుందని విశ్వసిస్తున్నామని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రష్యా ఉప విదేశాంగ మంత్రి ఆంద్రీ రుడెంకో మాస్కోలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో గుల్ హసన్ హసన్‌ను కలిశారు.

కాబూల్‌లోని తాలిబన్ అధికారులు రష్యా చర్యను స్వాగతించారు. ఇది రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. తాలిబన్ తాత్కాలిక విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాకి మాట్లాడుతూ ఇది రెండు దేశాల సంబంధాల చరిత్రలో ఒక పెద్ద విజయంగా అభివర్ణించారు.

2021 ఆగస్టులో తాలిబన్లు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా రష్యా కాబూల్‌లోని తన రాయబార కార్యాలయాన్ని తెరిచి ఉంచింది. తాలిబన్ నాయకత్వంతో సంబంధాలు కొనసాగిస్తుంది. వాణిజ్యం, ఆర్థిక రంగాలలో సహకారాన్ని పెంపొందుతుందని భావిస్తున్నారు. ఇంధనం, రవాణా, వ్యవసాయం , మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో పనిచేయాలని యోచిస్తోందని రష్యా ప్రభుత్వం తెలిపింది. దీంతో పాటు విద్య, సంస్కృతి, క్రీడలు , మానవతా రంగాలలో సంబంధాలను బలోపేతం చేయాలనే కోరిక కూడా వ్యక్తమైంది.ఇప్పటివరకు ఏ దేశం కూడా తాలిబన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించలేదు. చాలా దేశాలు తాలిబన్లు అంతర్జాతీయ ప్రమాణాలకు, ముఖ్యంగా మానవ హక్కుల విషయాలకు తమ నిబద్ధతను ప్రదర్శించాలని ఎదురు చూస్తున్నాయి. రష్యా తాలిబన్లను గుర్తించినప్పటికీ, వారి మానవ హక్కుల రికార్డును మెరుగుపరచుకోవాలని తాలిబన్లపై ఇప్పటికీ ప్రపంచవ్యాప్త ఒత్తిడి ఉంది.

# అణు బాంబు తయారీకి సై అంటున్న ఇరాన్..!

- **ఆందోళనలో అమెరికా, ఇజ్రాయెల్**
- **అంతర్జాతీయ అణుశక్తి సంస్థకు అనుమతి లేదు**
- **అణుబాంబులు తయారు చేయాలంటే ఎవరూ ఆపలేరన్న ఖమేనీ**

**టీపీఎన్, ఇరాన్ :**



అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (IAEA)తో సహకరించకూడదని ఇరాన్ నిర్ణయించింది. గత నెలలో ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ , అమెరికా దాడుల తర్వాత ఈ నిర్ణయం తీసుకుంది. IAEAతో సహకారాన్ని రద్దు చేస్తూ ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ ఒక చట్టంపై సంతకం చేశారు.

**ఇరాన్ కొత్త చట్టం**

ఇజ్రాయెల్‌తో ఇరాన్ కాల్పుల విరమణకు ఒక రోజు తర్వాత జూన్ 24న ఇరాన్ పార్లమెంట్ IAEAతో సహకారాన్ని ముగించాలని అత్యధికంగా ఓటు వేసింది. ఈ చట్టం ఇప్పుడు అమల్లోకి వచ్చిందని అక్కడి మీడియా చెబుతోంది. దీంతో ఇరాన్ అణు కార్యక్రమం ఇకపై అంతర్జాతీయ పర్యవేక్షణలో ఉండదు. అటువంటి పరిస్థితిలో, ఇరాన్ తన అణు మిషన్‌ను రహస్యంగా కొనసాగించవచ్చు. అణుశక్తిని కలిగి ఉండాలా వద్దా అని మరే ఇతర దేశం తనకు చెప్పకూడదని ఇరాన్ ఇప్పటికే చెప్పేసింది.

**IAEA నుండి విడిపోయిన తర్వాత**

